RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 113 | మే 19 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 113 | May 19 Thursday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి 2

## విపత్తులు సంభవిస్తే నష్టాన్ని నివారించడమే లక్ష్యం

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



**హైదరాబాద్ జనసంఘర్షణ**

ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలను కాపాడటంతో పాటు వీలైనంత వరకు ఆస్తి నష్టాన్ని నివారించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్రంలో విపత్తు రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన బృహత్తర మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయన కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణ సన్నద్ధతపై సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... దేశంలోని ఇతర రాష్ట్రాలలో విపత్తులను ఎదుర్కోవడానికి అమలు చేస్తున్న అత్యుత్తమ, విజయవంతమైన విధానాలను అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా తెలంగాణలో కూడా విపత్తు నిర్వహణ వ్యవస్థను అత్యంత పటిష్టంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, భారీ అగ్నిప్రమాదాలను

మిగతా 2వ పేజిలో..

## దేశవ్యాప్తంగా నక్సలిజం రహిత సమాజమే లక్ష్యం

**కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా**



**రాయ్‌పూర్ జనసంఘర్షణ :**

భారతదేశాన్ని దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి శాశ్వతంగా ముగింపు పలికి, దేశవ్యాప్తంగా నక్సలిజం రహిత సమాజాన్ని స్థాపించడమే కేంద్ర ప్రభుత్వ ముఖ్య సంకల్పమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగదల్‌పూర్‌లో సోమవారం నాడు నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల పూర్తిస్థాయి నిర్మూలనకు మరియు శాంతిభద్రతల పరిరక్షణకు అహర్నిశలు శ్రమిస్తూ అత్యంత ప్రతిభ కనబరిచిన వివిధ రాష్ట్రాల పోలీస్ అధికారులను ఈ సందర్భంగా హోంమంత్రి ఘనంగా సన్మానించారు. ఈ సదస్సులో ఆయన ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రస్తావిస్తూ... ఒకప్పుడు తీవ్రంగా ఉన్న నక్సలిజాన్ని అక్కడ సమూలంగా అణచివేసి, తెలంగాణను నక్సల్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో అసాధారణమైన పాత్ర పోషించిన ఆ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ

మిగతా 2వ పేజిలో..

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

**పదిమంది మృతి**

**ముంబై జనసంఘర్షణ :**

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించి పెళ్లి బృందంలో తీవ్ర విషాదం నిండింది. రాష్ట్రంలోని పాల్‌ఘర్ జిల్లా పరిధిలో ప్రయాణికులతో వెళ్తున్న ఒక ట్రక్కును అతివేగంగా వచ్చిన కంటెయినర్ బలంగా ఢీకొట్టడంతో పది మందికి పైగా అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ముంబై – అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ఈ ఊహించని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ధాటికి ట్రక్కులో ప్రయాణిస్తున్న వారిలో పది మంది ప్రాణాలు కోల్పోగా, మరో 25 మందికి పైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, సమాచారం అందుకున్న పోలీసులు యుద్ధప్రాతిపదికన

మిగతా 2వ పేజిలో..

## ఈపీసెట్ 2026 ఫలితాలలో విద్యార్థులు హవా



**హైదరాబాద్ జనసంఘర్షణ :**

తెలంగాణ రాష్ట్రంలో విడుదలైన ఈఏపీసెట్ (ఈపీసెట్)-2026 ఫలితాలలో మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ (ఎంజేపీ) విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి తమ హవా చాటారు. ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పోటీ పరీక్షలో అగ్రికల్చర్, ఫార్మసీ మరియు ఇంజనీరింగ్ విభాగాలలో కలిపి మొత్తం 3,781 మంది ఎంజేపీ గురుకుల విద్యార్థులు అర్హత సాధించి రికార్డు సృష్టించారు. వీరిలో 46 మంది విద్యార్థులు ఐదు వేల లోపు ర్యాంకులు కైవసం చేసుకోగా,

మిగతా 2వ పేజిలో..

## నిజామాబాద్‌కు పంగనామాలు

**నిజామాబాద్ ఎంపీ అర్వింద్**



**నిజామాబాద్ జనసంఘర్షణ**

నిజామాబాద్ జిల్లా అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నగరానికి గతంలో వాగ్దానం చేసిన ఔటర్ రింగ్ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) వంటి కీలకమైన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా తుంగలో తొక్కిందని ఆయన ఆరోపించారు. సోమవారం నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ అరవింద్ మాట్లాడుతూ... ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం కావడంతో స్వయంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జిల్లాలో తలెత్తుకోలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయంగా పీసీసీ చీఫ్‌ను అణగదొక్కాలనే కుట్రతోనే నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులు ఇవ్వకుండా మొండిచేయి చూపించారని విమర్శించారు. జిల్లాకు ఇంతటి అన్యాయం జరుగుతుంటే ఏ ముఖం పెట్టుకుని టీపీసీసీ అధ్యక్షుడు జిల్లాలో పర్యటిస్తున్నారని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఇందూరు ప్రజలను మోసం చేసిన పాలకులకు రాబోయే రోజుల్లో ఇక్కడి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దైవ సాక్షిగా ఇచ్చిన మాటలనే తప్పి, దేవుళ్లనే మోసం చేసిన కాంగ్రెస్ పాలకులకు సామాన్య ప్రజలను వంచించడం

మిగతా 2వ పేజిలో..

## కేరళలోనూ ఫ్రీ బస్



**తిరువనంతపురం జనసంఘర్షణ :**

కేరళ రాష్ట్రంలో సరికొత్త రాజకీయ శకం ప్రారంభమవడంతో పాటు మహిళలకు భారీ ఊరట లభించింది. కేరళ నూతన ముఖ్యమంత్రిగా సోమవారం నాడే ప్రమాణస్వీకారం చేసిన వీడీ సతీశన్, బాధ్యతలు చేపట్టిన వెంటనే తన తొలి మంత్రివర్గ సమావేశంలోనే సంచలన సంక్షేమ, పాలనాపరమైన

మిగతా 2వ పేజిలో..

## ఇరు దేశాల సంబంధాలు శిఖరాలకు ...

- ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాల కోసం 'గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్'



**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**

భారతదేశం మరియు నార్వే దేశాల మధ్య దౌత్య, ఆర్థిక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లే దిశగా ఒక చారిత్రాత్మక అడుగు పడింది. నార్వే పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాల కోసం 'గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్' (హరిత వ్యూహాత్మక భాగస్వామ్యం) ఏర్పాటు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ నూతన ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య పర్యావరణ అనుకూల స్వచ్ఛ ఇంధనం, సముద్ర పరిశోధనలు, సరికొత్త ఆవిష్కరణలు మరియు అధునాతన సాంకేతిక రంగాలలో పరస్పర సహకారం మరింత బలోపేతం కానుందని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండించి, ఆ క్లిష్ట సమయంలో భారతదేశానికి అండగా నిలిచినందుకు

మిగతా 2వ పేజిలో..

# విపత్తులు సంభవిస్తే నష్టాన్ని నివారించడమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి..** సమర్థవంతంగా తట్టుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, అధునాతన రక్షణ పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. వాటి పూర్తి వివరాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను తక్షణమే ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు.

అడవుల్లో సంభవించే దావానలం పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో నివాస, వాణిజ్య సముదాయాలలో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాల రక్షణ చర్యలను తెలంగాణలో ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఈ మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలను ప్రత్యేక రెస్క్యూ బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖల సిబ్బందిని మంత్రి అభినందించారు. ఈ భారీ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్, ఫైర్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ, పరిశ్రమలు, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## దేశవ్యాప్తంగా నక్సలిజం రహిత సమాజమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి..** రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) సి.వి. ఆనంద్, రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారు మరియు మాజీ డిజిపి బి. శివధర్ రెడ్డి, డిజిపి ఆపరేషన్స్ (ఆక్టోపస్ / గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ మరియు మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఇంటెలిజెన్స్ (ఎస్ఐబీ) ప్రత్యేక బృందాన్ని హోంమంత్రి అమిత్ షా శాలువాలు కప్పి, జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... గత జనవరి 2024లో నిర్వహించిన ఒక ఉన్నత స్థాయి అంతర్గత సమావేశంలో తాము మార్చి 31, 2026 నాటికి దేశం నలుమూలల నుండి నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని ఒక స్పష్టమైన కాలపరిమితిని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. తాము ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్న సమయంలో చాలామంది అంతర్గత చర్చల్లో ఇది ఆచరణలో సాధ్యం కాదంటూ తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారని గుర్తుచేశారు.

అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం వెనకడుగు వేయకుండా అత్యంత స్పష్టమైన ప్రణాళికలు, పక్కా వ్యూహాత్మక చర్యలతో ముందుకు సాగిందని హోంమంత్రి చెప్పారు. ఈ రోజు దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో దశాబ్దాలుగా నక్సల్స్ గుప్పిట్లో ఉన్న బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహిత ప్రాంతంగా ప్రకటించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని హర్షం వ్యక్తం చేశారు.

ఈ ప్రతిష్ఠాత్మక సన్మాన కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, వివిధ రక్షణ మరియు భద్రతా దళాల ఉన్నత శ్రేణి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారతదేశం, నార్వే దేశాల శిఖరాలకు

నార్వే ప్రభుత్వానికి ప్రధాని మోదీ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక రంగాలలో అస్థిరత పెరుగుతున్న తరుణంలో భారత్ – ఐరోపా (యూరప్) దేశాల మధ్య భాగస్వామ్యం అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడటంతో పాటు అంతర్జాతీయ నిబంధనల అమలు, శాంతి భద్రతల పరిరక్షణ కోసం భారత్, యూరప్ దేశాలు కలిసికట్టుగా పనిచేస్తున్నాయని వివరించారు.

భారతదేశం మరియు యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందాల వల్ల అటు భారతదేశానికి, ఇటు నార్వే దేశానికి భవిష్యత్తులో అనేక ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు అంతరిక్ష రంగంలోనూ కీలక ఒప్పందం కుదిరింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరియు నార్వే స్పేస్ ఏజెన్సీల మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం ప్రకారం భవిష్యత్తులో చేపట్టబోయే శాస్త్ర సాంకేతిక పరిశోధనల కోసం నార్వే యొక్క అత్యాధునిక సాంకేతిక సహాయాన్ని భారతదేశం తీసుకోనుంది. భారతదేశంలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని వివరిస్తూ... నార్వేకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ సంస్థలు భారత్‌లో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్ పరిశ్రమ, బ్లూ ఎకానమీ మరియు డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాలలో భారీగా పెట్టుబడులు పెట్టాలని ప్రధాని మోదీ ఆహ్వానం పలికారు. వీటితో పాటు ఆర్కిటిక్ ప్రాంతంలో శాస్త్రీయ పరిశోధనలు, అంతరిక్ష రంగ ప్రయోగాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు), సెమీకండక్టర్ల తయారీ మరియు డిజిటల్ ఇన్నోవేషన్ వంటి అత్యాధునిక సాంకేతిక విభాగాలలో కూడా భారత్ – నార్వే దేశాలు సంయుక్తంగా కలిసి ముందుకు సాగుతాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘంటాపథంగా పేర్కొన్నారు.

# ఈపీసెట్ 2026 ఫలితాలలో విద్యార్థులు హవా

**మొదటిపేజీ తరువాయి..** 178 మంది విద్యార్థులు పది వేల లోపు ఉత్తమ ర్యాంకులను సాధించి విద్యాసంస్థల కీర్తిని మరింత పెంచారు. ప్రత్యేకించి అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హర్షిణి 516వ ర్యాంక్‌తో అత్యుత్తమ ప్రతిభ కనబరచగా, కల్పిత 1315వ ర్యాంక్, కె. శ్రవణ్ కుమార్ 1377వ ర్యాంక్, టి. నవ్య 1692వ ర్యాంక్ సాధించి ముందంజలో నిలిచారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో బి. అనిరుధ్ 3513వ ర్యాంక్, జి. వినోద్ కుమార్ 3568వ ర్యాంక్, ఎన్. రుషిక్ వర్మ 4433వ ర్యాంక్‌తో టాప్ ర్యాంకర్లుగా నిలిచారు.

ఈ ఫలితాల గణాంకాలను పరిశీలిస్తే, అగ్రికల్చర్ మరియు ఫార్మసీ విభాగంలో మొత్తం 1,626 మంది ఎంజేపీ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఐదు వేల లోపు ర్యాంకులను 43 మంది, పది వేల లోపు ర్యాంకులను 122 మంది సొంతం చేసుకున్నారు. అంతేకాకుండా 20,000 లోపు ర్యాంకులను 247 మంది, 40,000 లోపు ర్యాంకులను 703 మంది విద్యార్థులు సాధించారు. మరోవైపు ఇంజనీరింగ్ విభాగంలో మొత్తం 2,155 మంది విద్యార్థులు క్వాలిఫై కాగా, వారిలో ఐదు వేల లోపు ర్యాంకులు ముగ్గురికి, పది వేల లోపు ర్యాంకులు 56 మందికి లభించాయి. అలాగే 20,000 లోపు ర్యాంకులను 167 మంది, 40,000 లోపు ర్యాంకులను 412 మంది విద్యార్థులు దక్కించుకున్నారు. ఈ ఘన విజయంతో ఉన్నత విద్యా కోర్సులకు అర్హత సాధించిన విద్యార్థులను, వారికి అహర్నిశలు మార్గదర్శకత్వం వహించిన బోధనా సిబ్బందిని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి బాల మాయాదేవి, ఎంజేపీ సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రత్యేకంగా అభినందించారు.

ఈ అసాధారణ ఫలితాలు బీసీ గురుకుల విద్యాసంస్థలలో ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యా ప్రమాణాలకు, క్రమశిక్షణకు మరియు ప్రత్యేక శిక్షణా విధానాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, అందులో భాగంగానే విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు వసతి గృహాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచామని స్పష్టం చేశారు. విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలలో రాణించేలా ప్రత్యేక ఆన్‌లైన్ కోచింగ్ ద్వారా నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా కేవలం రెండు కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) విద్యాసంస్థలు మాత్రమే అందుబాటులో ఉండగా, గత ఏడాది కొత్తగా పది సంస్థలను, ఈ విద్యాసంవత్సరంలో మరో పది సంస్థలను అదనంగా ఏర్పాటు చేశామని వివరించారు. రాబోయే సంవత్సరంలో మరింత ఎక్కువ సంఖ్యలో బీసీ గురుకుల విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సుల ప్రవేశ పరీక్షలకు ముందస్తు శిక్షణ పొంది, దీనికంటే మరిన్ని అత్యుత్తమ ఫలితాలను సాధిస్తారనే ఆశాభావాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యక్తంచేశారు.

## నిజామాబాద్‌కు పంగనామాలు

**మొదటిపేజీ తరువాయి..** ఎద్ద లెక్కేమీ కాదని ఎంపీ అరవింద్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిజామాబాద్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ఎప్పటికీ పూర్తి కావని ఆయన కుండబద్దలు కొట్టారు. ఇప్పటివరకు నగర పరిధిలో కేవలం 25 శాతం డ్రైనేజీ పనులు కూడా పూర్తి కాలేదని, ఈ ప్రాజెక్టుకు అవసరమైన రూ.162 కోట్లకు గాను ప్రస్తుత ప్రభుత్వం కేవలం రూ.10 కోట్ల నిధులను మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని గణాంకాలతో సహా వివరించారు. ఇదే సమయంలో జాతీయ రాజకీయాలను ప్రస్తావిస్తూ... 2039వ సంవత్సరం వరకు రాహుల్ గాంధీ దేశానికి ప్రధానమంత్రి కాలేరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు. దీనిని బట్టి దేశంలో రాబోయే మరో పదేళ్ల పాటు బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందనే నిజాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి పరోక్షంగా ఒప్పుకున్నట్లు అయిందని విశ్లేషించారు.

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నైజానికి బదులుగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి లాంటి నిజాయితీ గల నాయకుడిని తెలంగాణ ముఖ్యమంత్రిగా నియమిస్తే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఎంపీ అరవింద్ ఈ సందర్భంగా సూచించారు. బుల్లెట్ రైల్ కారిడార్ నిర్మాణ విషయమై సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు పచ్చి అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. గతంలో నిజామాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అప్‌గ్రేడ్ చేస్తానని ప్రగల్భాలు పలికిన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌నే ఇక్కడి ప్రజలు నమ్మకుండా పక్కన పెట్టారని, అలాంటిది ఇప్పుడు ఉనికిలోనే లేని 'ఫ్యూచర్ సిటీ' గురించి రేవంత్ రెడ్డి మాట్లాడితే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నిస్తూ ముఖ్యమంత్రికి ఎంపీ అరవింద్ గట్టి చురకలు అంటించారు.

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

**సిద్దిపేట:**

సిద్దిపేట జిల్లాలో జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదం ఒకే కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వేగంగా వచ్చిన ఒక కారు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న భార్యాభర్తలు ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ చేదు ఘటన గజ్వేల్ పరిసర ప్రాంతంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం షేర్‌పల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ (50), ఆయన భార్య జ్యోతి (45) తమ వ్యక్తిగత పనుల నిమిత్తం ఇద్దరూ కలిసి ఒకే బైక్‌పై బయటకు వెళ్లారు. ఈ క్రమంలో వారు గజ్వేల్ సమీపంలోని పత్తి మిల్లు వద్దకు చేరుకోగానే, ఎదురుగా వస్తున్న ఒక కారు వీరి వాహనాన్ని అత్యంత వేగంగా ఢీకొట్టింది.

ఈ ప్రమాద తీవ్రత చాలా ఎక్కువగా ఉండటంతో ప్రవీణ్, జ్యోతి ఇద్దరూ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే కన్నుమూశారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న గజ్వేల్ పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, మృతుల దేహాలను పోస్ట్‌మార్టం పరీక్షల నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం ఏ విధంగా జరిగింది, కారు డ్రైవర్ నిర్లక్ష్యం ఎంతవరకు ఉందనే

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ దారుణ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. పోలీసులు వెల్లడించిన ప్రాథమిక వివరాల ప్రకారం.. ఒక వివాహ వేడుకకు హాజరై తిరిగి వెళ్తున్న పెళ్లి బృందం ప్రయాణిస్తున్న ట్రక్కును, ఎదురుగా వస్తున్న కంటైనర్ అదుపుతప్పి అత్యంత వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రత ఏ స్థాయిలో ఉందంటే.. కంటైనర్ తగలగానే ట్రక్కు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయి గుర్తుపట్టలేని విధంగా తయారైంది. ఈ శిథిలాల మధ్య నలిగిపోయి ఘటనా స్థలంలోనే పది మంది ప్రాణాలు విడిచారు. తీవ్రంగా గాయపడిన బాధితులందరినీ పోలీసులు, స్థానికులు కలిసి తక్షణమే సమీపంలోని ఆసుపత్రులకు తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులలో పలువురి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం అత్యంత విషమంగా ఉందని, దీనివల్ల మృతుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదం ఉందని ఆసుపత్రి వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ ఘోర ప్రమాదం కారణంగా ముంబై – అహ్మదాబాద్ హైవేపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రంగంలోకి దిగిన పోలీసులు ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్ల సహాయంతో పక్కకు తొలగించి, హైవేపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అతివేగం మరియు డ్రైవర్ల నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. పెళ్లి వేడుక ముగించుకుని ఎంతో సంతోషంగా ఇళ్లకు తిరిగి వస్తున్న సమయంలో జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదంతో సదరు కుటుంబాలలోను, వారి బంధువులలోను ఒక్కసారిగా కన్నీరు మున్నీరై తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది.

## కేరళలోనూ ఫ్రీ బస్

**మొదటిపేజీ తరువాయి..** నిర్ణయాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని మహిళలకు కేరళ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (కేఎస్ఆర్టీసీ) బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు. ఈ ఉచిత బస్సు ప్రయాణ పథకం రాబోయే జూన్ 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి రానుంది. వివిధ రంగాలలో ఉద్యోగాలు చేసే మహిళలు, విద్యాభ్యాసం కోసం వెళ్లే విద్యార్థినులు, నిత్యం ప్రయాణాలు చేసే రోజువారీ మహిళా కార్మికులపై ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గించడమే ధ్యేయంగా ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

మహిళల ఉచిత ప్రయాణంతో పాటు వృద్ధుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి సతీశన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో వృద్ధుల జనాభా క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో, వారి అవసరాలను గుర్తించి దేశంలోనే తొలిసారిగా సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక ప్రభుత్వ శాఖను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నూతన శాఖ ద్వారా వృద్ధుల ఆరోగ్య సంరక్షణ, సామాజిక భద్రత, వారి పునరావాస కార్యక్రమాలతో పాటు వివిధ వృద్ధాప్య సంక్షేమ పథకాలను ఒకే గొడుగు కిందికి తెచ్చి సమర్థవంతంగా సమన్వయం చేయనున్నట్లు వివరించారు. ఇదే తరుణంలో కేరళ ప్రజారోగ్య రక్షణ వ్యవస్థలో అహర్నిశలు శ్రమిస్తున్న ఆశా వర్కర్ల సేవలను ప్రభుత్వం గుర్తించింది. వారి అంకితభావానికి గౌరవ సూచికంగా ఆశా వర్కర్ల నెలవారీ గౌరవ వేతనాన్ని రూ.3,000 లకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అలాగే వివిధ ప్రభుత్వ విభాగాల పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల జీతాలను వెయ్యి రూపాయల చొప్పున పెంచుతున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట సిబ్బంది, ఇతర సహాయక కార్మికులు మరియు ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయులకు కూడా అదనంగా నెలకు రూ.1,000 చొప్పున వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మరోవైపు రాజకీయ, పాలనాపరమైన పారదర్శకత కోసం నూతన ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. గతంలో 2023లో జరిగిన నవ కేరళ యాత్ర సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడుల ఉదంతాలపై పూర్తిస్థాయి దర్యాప్తు కోసం ఒక ప్రత్యేక విచారణ బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సతీశన్ వెల్లడించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై మరియు శాంతిభద్రతలపై ప్రజల్లో నమ్మకాన్ని తిరిగి పునరుద్ధరించడానికి, తప్పు చేసిన వారిపై జవాబుదారీతనాన్ని నిర్దేశించడానికే ఈ విచారణకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు కేరళ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం ఏ స్థితిలో ఉందో ప్రజలకు స్పష్టంగా తెలియజేయడానికి త్వరలోనే ఒక సమగ్ర శ్వేతపత్రాన్ని (వైట్ పేపర్) విడుదల చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులు, ఆదాయ వనరులు, జరుగుతున్న వ్యయాలపై ప్రజలకు పూర్తి పారదర్శకతను అందించడానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని సీఎం వీడీ సతీశన్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వద్ద అఖిలపక్షం, విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా

రుద్రూర్: మే 18( జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని అక్బర్ నగర్ వద్ద గల ప్రాంతీయ చెరుకు మరియు పరిశోధన స్థానం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వద్ద అఖిలపక్షం, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు, విద్యాల సంఘ నాయకులు మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల అక్బర్ నగర్ లో గల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను జగిత్యాలలోని కళాశాలలో విలీనం చేయడానికి ప్రభుత్వం యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు. దానికి సంబంధించిన ప్రొసీడింగ్ ఆర్డర్స్ కూడా యూనివర్సిటీ అధికారులు సంబంధిత అధికారులకు పంపించడం జరిగింది. ఈ విద్యా సంవత్సరం 2026-27 సంబంధించిన అడ్మిషన్లు ఇక అక్బర్ నగర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో జరగవని జగిత్యాలలోని పోలాస కళాశాలలో విలీనం చేస్తున్నట్లు నిర్ణయించారు. దీనికి అఖిలపక్ష విద్యార్థి సంఘం నాయకులు పూర్తిగా వ్యతిరేకిస్తుంది విద్యాభివృద్ధి చేస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నేడు ఉన్న కళాశాలలను మూసివేసి, విలీనం పేరుతో విద్యార్థులకు సాంకేతిక విద్య దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అక్బర్ నగర్ లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కళాశాల నడపడానికి అన్ని సౌకర్యాలు ఉన్న ఇక్కడ విద్యార్థులు లేరు అనే నేపంతో కళాశాలను తరలించాలని చూస్తున్నారు ఇక్కడ విద్యార్థులకు హాస్టల్ వసతి, సరిపడా తరగతి గదులు ప్రాక్టికల్‌గా తెలుసుకోవడానికి




వ్యవసాయ భూమి అన్ని రకాల శాస్త్రవేత్తలు అధ్యాపకులు అందుబాటులో ఉన్న కూడా ఇక్కడి నుంచి ఈ కళాశాల తలలించే క్రమంలో ఇదంతా జరుగుతున్నదని కొంత మంది అధికారులు కూడా దీనికి ప్రయత్నాలు చేస్తున్నారు అని మేము భావిస్తున్నాం. నిజామాబాద్ జిల్లా విద్యార్థులకు మోసం చేయడం అవుతుందని అన్నారు, ఇదే జరిగితే విద్యార్థులు అందరినీ ఏకం చేసి యూనివర్సిటీ కి తాళం వేస్తాం అని హెచ్చరిస్తున్నాం, విద్యార్థుల అడ్మిషన్స్ ఏ విధంగా పెంచుకోవాలని చూడాలి తప్ప ఉన్న కళాశాల మూసివేయడం సరికాదు, కళాశాలలో 20 మందికి విద్యార్థుల గాను 20 మంది విద్యార్థులు ఉన్నారు ఎక్కడ కూడా విద్యార్థుల సంఖ్య తగ్గలేదు అయినా కూడా ఈ కళాశాలను తరలించే ప్రయత్నం చేస్తున్నారు, ప్రభుత్వం విద్యను బలవంతం చేయలే తప్ప కొనసాగే కళాశాలను మూసివేయడం మంచి పర్వం కాదు నిజామాబాద్ జిల్లాలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఒకటే ఉన్నది. కావున దీని దృష్టిలో ఉంచుకొని కళాశాలలను ఈ విద్యా సంవత్సరం ఇక్కడి నుంచే కొనసాగించాలని, ఇచ్చిన ప్రొసీడింగ్ ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు గౌతం కుమార్, అక్బర్ నగర్ గ్రామ సర్పంచ్ సీతారాం రాజు ఉప సర్పంచ్ హబీబ్ ఖాన్, జహీరాబాద్ దిశా కమిటీ సభ్యులు నడిపింటి నగేష్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు కార్తీక్ , మాజీ ఏఎంసీ చైర్మన్ బందుల సంజీవులు, మాజీ సర్పంచ్ రామ గౌడ్ అంబం. గ్రామ సర్పంచ్ గంగాధర్, బీఎస్పీ మండల అధ్యక్షులు గౌతమ్ కామ్లే బిజెపి నాయకులు రాజు, చిన్న సాయిలు, బిఆర్ఎస్ నాయకులు వీణ మతిన్, మాజీ ఉప సర్పంచ్ నీరడి శంకర్ ,రజాక్, జాకీర్, సురేష్, కృపారావు, అశోక్ గౌడ్, ఫిరోజ్ ఖాన్, లక్ష్మణ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## భద్రాద్రి జిల్లా బీజేపీ నూతన కార్యదర్శిగా 'సేనాపతి మురళి కృష్ణ'

- నిస్వార్థ సేవకు దక్కిన గుర్తింపు: బీజేపీ జిల్లా కార్యదర్శిగా సేనాపతి మురళి కృష్ణ
- తెలంగాణ ఉద్యమకారుడు, కరోనా వారియర్ మురళి కృష్ణకు బీజేపీలో కీలక పదవి
- బూత్ ఇంచార్జ్ నుండి జిల్లా సెక్రటరీ వరకు: మురళి కృష్ణ రాజకీయ ప్రస్థానం

ఇల్లందు మే 18 (జన సంఘర్షణ)

రాజకీయం అంటే అధికారం కాదు.. అంగబలం, అర్థబలం అంతకన్నా కాదు.. కేవలం 'ప్రజాసేవ' మాత్రమే అని నిరూపిస్తూ, క్షేత్రస్థాయి నుండి జిల్లా స్థాయి నేతగా ఎదిగిన అరుదైన వ్యక్తిత్వం ఆయన సొంతం. తనపై నమ్మకం ఉంచి, భద్రాద్రి జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యదర్శిగా ఇంతటి కీలకమైన బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావుకి, అలాగే భద్రాద్రి జిల్లా బిజెపి అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డికి సేనాపతి మురళి కృష్ణ తన హృదయపూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. "పదవి అనేది కేవలం అలంకారం కాదు.. అదొక గురుతరమైన బాధ్యత" అని నమ్మే మురళి కృష్ణకు ఈ కీలక పదవి దక్కడం పట్ల జిల్లావ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**మధ్యతరగతి మూలాలు - సాధారణ విద్యాభ్యాసం**

సేనాపతి మురళి కృష్ణ 1987 సెప్టెంబర్ 23న ఇల్లందు పట్టణంలో సేనాపతి వెంకటేశ్వర్లు, శోభ దంపతులకు జన్మించారు. ఒక సాధారణ గ్రామీణ మధ్యతరగతి కుటుంబంలో పెరిగిన ఆయనకు, చిన్నతనం నుంచే ఆడంబరాలపై ఆసక్తి లేదు. కేవలం సర్టిఫికెట్ల కోసం చదివే ఆడంబరాల చదువు కంటే సమాజానికి ఉపయోగపడే తెలివితేటలే మిన్న అని నమ్మారు. 2003లో ఇల్లందు జవహర్ హైస్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసి, ఆ తర్వాత దూరవిద్య (ణఅఖ్ఝఅఎవ జుుబఎ్ఖ్అశీఅ) ద్వారా డిగ్రీ పట్టా అందుకున్నారు.

**రాజకీయ ప్రేరణ - నిస్వార్థ అడుగులు**

చదువు పూర్తయ్యాక, ప్రజల కోసం పనిచేసే రాజకీయ నాయకుల జీవన విధానం మురళి కృష్ణను ఎంతగానో ఆకర్షించింది. నిస్వార్థంగా సమాజానికి సేవ చేయాలంటే రాజకీయమే అత్యుత్తమ వేదిక అని భావించారు. ఏ పదవి ఉన్నా, లేకపోయినా ప్రజల పక్షాన నిలబడాలనే దృఢ సంకల్పంతో ఆయన ప్రజా క్షేత్రంలోకి అడుగుపెట్టారు.

**బీజేపీలో చేరిక - క్షేత్రస్థాయి నుండి ప్రస్థానం**

భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వానీ వంటి మహామహుల సిద్ధాంతాలకు ఆకర్షితులై 2015లో ఆయన భారతీయ జనతా పార్టీలో చేరారు. పార్టీలోకి రాగానే పెద్ద పదవులను ఆశించకుండా, ఇల్లందు టౌన్ బూత్ ఇంచార్జ్‌గా అత్యంత కిందిస్థాయి బాధ్యతలను స్వీకరించి, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పార్టీ నిర్మాణానికి గట్టి పునాది వేశారు.

**బజరంగ్ దళ్ నుండి సనాతన ధర్మ రక్షణ వరకు**

2019లో ఆయన ఇల్లందు బిజెపి అనుబంధంగా బజరంగ్ దళ్ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. 2020 వరకు ఆ బాధ్యతల్లో ఉంటూ సాంస్కృతిక, ధార్మిక విలువలను కాపాడటంలో చురుకైన పాత్ర పోషించారు. పార్టీ నిబంధనలకు లోబడి, హిందూ సమాజ శ్రేయస్సుకై ఆయన చేసిన కృషి యువతలో సరికొత్త జోష్ నింపింది.





**ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యత - యువమోర్చా ప్రమోషన్**

మురళి కృష్ణ నిబద్ధతను గమనించిన అధిష్ఠానం, 2020 ఎమ్మెల్సీ ఎన్నికల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తరపున నియోజకవర్గ కన్వీనర్‌గా కీలక బాధ్యతలను అప్పగించింది. ఆ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించి పార్టీ శ్రేణులను నడిపిన తీరుకు గుర్తింపుగా, అదే సంవత్సరంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బి జె వై ఎం (యువ మోర్చా) జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆయన ప్రమోషన్ పొందారు.

**దేశసేవలో భాగస్వామ్యం - ఆర్ఎస్ఎస్ సభ్యత్వం**

ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ అయిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో ఒక సాధారణ స్వయంసేవకుడిగా మురళి కృష్ణ చేరారు. లక్షలాది మంది సభ్యులు ఉన్న ఈ సంస్థలో క్రమశిక్షణ, దేశభక్తి పాఠాలను వంటబట్టించుకుని, సమాజంలో అంతర్గత మార్పు కోసం నిరంతరం శ్రమిస్తూ వస్తున్నారు.

**యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా ప్రభంజనం**

ఆయన నిరంతర క్షేత్రస్థాయి పర్యటనలు, ప్రజా సమస్యలపై పోరాటాలను గుర్తిస్తూ 2021లో మురళి కృష్ణను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిజెపి యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ పదవిలో ఉంటూ జిల్లావ్యాప్తంగా ఉన్న యువతను ఏకం చేసి, ఉపాధి అవసరాలపై ఎన్నో సభలు, సమావేశాలు విజయవంతంగా నిర్వహించారు.

**తెలంగాణ మలిదశ ఉద్యమంలో గర్జన**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో మురళి కృష్ణ అగ్నిశిఖలా మారారు. ఇల్లందు లో జరిగిన 'మహా ధర్నా'లో ముందు వరుసలో ఉండి ఉద్యమాన్ని తన దైన శైలిలో ముందుకు తీసుకొని వెళ్ళారు. పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్రలు చేస్తూ, దాదాపు 25 రోజుల పాటు నిరంతరాయంగా సాగిన నిరసన దీక్షల్లో కీలక పాత్ర పోషించారు. రాస్తా రోకోలు, మిలియన్ మార్చ్, బైక్ ర్యాలీలతో పాటు సకల జనుల సమ్మె కాలంలో రోడ్లపైన 'వంటా-వార్పు'లు నిర్వహించి ఉద్యమకారులకు అండగా నిలిచారు.

**కరోనా మొదటి వేవ్ - ప్రాణాలకు తెగించి సేవ**

కరోనా మహమ్మారి లోకాన్ని వణికించిన వేళ.. లాక్‌డౌన్ సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితమైతే, మురళి కృష్ణ మాత్రం ప్రాణాలకు తెగించి వీధుల్లోకి వచ్చారు. లాక్‌డౌన్ బాధితులకు, మున్సిపాలిటీ కార్మికులకు ఉచితంగా కూరగాయలు, పండ్లు, మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. వలస కార్మికులు, డ్రైవర్ల ఆకలి తీర్చడానికి ఫుడ్ ప్యాకెట్లు పంచారు. గ్రామాల రక్షణ కోసం సొంత ఖర్చులతో ఊరంతటా సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేయించి మానవత్వాన్ని చాటుకున్నారు.

**కరోనా సెకండ్ వేవ్ - ఆక్సిజన్ యోధుడిగా..**

కరోనా సెకండ్ వేవ్ సమయంలో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ బాధితులకు ఆక్సిజన్ సిలిండర్లు అందేలా సిబ్బందితో మాట్లాడారు. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ ఆసుపత్రులలో బెడ్లు ఇప్పించి ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. "కరోనా వైద్యం పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారంగా మారింది.. వెంటనే దీన్ని ఆరోగ్యశ్రీలో చేర్చాలి" అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరంతరం ప్రజాక్షేత్రంలోనే గడిపారు. సాధారణ కార్యకర్త స్థాయి నుండి జిల్లా స్థాయి నేతగా ఎదిగిన సేనాపతి మురళి కృష్ణ ప్రస్థానం నేటి యువతకు ఆదర్శప్రాయం. ఉద్యమాల్లో అగ్నిశిఖగా, కరోనా వంటి విపత్కర సమయాల్లో ప్రాణాలకు తెగించి పోరాడిన అపర సంజీవనిగా, నిరుద్యోగులు, విద్యార్థులు, పేదల పక్షాన నిలిచే ప్రజా గొంతుకగా ఆయన నిరూపించుకున్నారు. పదవులను అలంకారంగా కాకుండా బాధ్యతగా భావించే మురళి కృష్ణ.. భద్రాద్రి జిల్లా బీజేపీ నూతన కార్యదర్శిగా నియమితులవ్వడం పార్టీ బలోపేతానికి మరింత దోహదం చేస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నూతన బాధ్యతలతో ఆయన భవిష్యత్తులో ప్రజాసేవలో మరిన్ని విజయాలు అందుకోవాలని, ఇల్లందు నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా పార్టీని విజయతీరాలకు చేర్చాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## ఇల్లందులో ప్రగతి పరుగు.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: కమిషనర్ శ్రీకాంత్

ఇల్లందు మే 18 (జన సంఘర్షణ)




ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలనే సంకల్పంతో ఇల్లందు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 1కే రన్ ఘనంగా నిర్వహించారు. గోవింద్ సెంటర్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన ఈ పరుగును మున్సిపల్ ఛైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పెండెల రాజు, కో-ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తితో పాటు మెప్మా, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఈ 1కే రన్ కేవలం ఒక రోజు ఈవెంట్ కాదని, పట్టణ సమగ్ర అభివృద్ధికి, పౌరుల భాగస్వామ్యానికి ఇదొక సంకేతమని పేర్కొన్నారు. ప్రజా పాలన లక్ష్యాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో ప్రతి అధికారి, సిబ్బంది సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల కల్పన, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల త్వరితగతిన పరిష్కారమే ధ్యేయంగా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## బక్రీద్ సందర్భంగా గోవుల అక్రమ రవాణా అరికట్టాలి

- బోధన్ సబ్ కలెక్టర్‌కు విహెచ్‌పీ, భజరంగ్ దళ్ వినతిపత్రం

బోధన/మే 18/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలో విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ గోసేవ-గోరక్ష విభాగం ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో విజయకుమారికి వినతిపత్రం సమర్పించారు. రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో గోవుల అక్రమ రవాణా, వధలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని వారు అధికారులను కోరారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో గోవులను అక్రమంగా తరలిస్తూ వధిస్తున్నారనే సమాచారం తమకు అందుతోందని నాయకులు తెలిపారు. హిందూ మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి చర్యలు జరిగినా సహించబోమని హెచ్చరించారు. గోవుల సంరక్షణ కోసం ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసి, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోసేవ-గోరక్ష విభాగం నాయకులు, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదవుల కన్నా 'పార్టీ ప్రయోజనాలే' మిన్న

భద్రాచలం మే 18 (జన సంఘర్షణ)



రాజకీయాల్లో పదవులు వస్తుంటాయి, పోతుంటాయి.. కానీ సిద్ధాంతం, పార్టీ పట్ల నిబద్ధత శాశ్వతంగా నిలిచిపోతాయని భద్రాచలం వేదికగా మరోసారి రుజువైంది. నేడు భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్‌ని, జిల్లా పూర్వ అధ్యక్షులు కే.వి. రంగా కిరణ్ శాలువాతో సత్కరించి ఆత్మీయ స్వాగతం పలికారు. సాధారణంగా పదవిలో ఉన్నప్పుడే గౌరవ మర్యాదలు ఆశించే నేటి స్వార్థ రాజకీయాల నడుమ.. మాజీ పదవిలో ఉండి కూడా, పార్టీ క్రమశిక్షణను గౌరవిస్తూ, ఉన్నత స్థాయి నాయకత్వాన్ని సాదరంగా ఆహ్వానించిన రంగా కిరణ్ నైజం క్షేత్రస్థాయి కార్యకర్తల్లో కొత్త ఆలోచనను రేకెత్తించింది. నాయకత్వ మార్పులు సహజమే అయినా, పార్టీ మూల సిద్ధాంతాన్ని మోస్తూ.. కొత్త పాతల కలయికతోనే పార్టీ బలోపేతం సాధ్యమని నిరూపించిన ఈ దృశ్యం, పదవుల వేటలో పడి విలువలను మరిచే ప్రతి ఒక్కరికీ ఒక నిశ్శబ్ద సందేశాన్ని ఇచ్చింది.

## ఆన్లైన్ 'మందు'.. క్షేత్రస్థాయి కెమిస్టులకు గుండెకోత

ఇల్లందు మే 18 (జన సంఘర్షణ)



కార్పొరేట్ శక్తుల ఆన్‌లైన్ దందా నడుమ.. ప్రజారోగ్య రక్షణే ధ్యేయంగా దశాబ్దాలుగా సేవలందిస్తున్న స్థానిక కెమిస్టుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే, ఆల్ ఇండియా మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మెడికల్ అసోసియేషన్ల పిలుపు మేరకు ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'ఆల్ ఇండియా కెమిస్ట్ బంద్' నోటీసును ఇల్లందు కెమిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్యకి అందజేశారు. కోవిడ్ సంక్షోభ కాలంలో జారీ చేసిన వివాదాస్పద తాత్కాలిక నోటిఫికేషన్ జి ఎస్ ఆర్ 220 (ఈ), ఈ-ఫార్మసీలకు పచ్చజెండా ఊపే జి ఎస్ ఆర్ 817 (ఈ) నోటిఫికేషన్లను తక్షణమే రద్దు చేయాలని, కార్పొరేట్ శక్తుల అనైతిక డిస్కౌంట్ దోపిడీని అరికట్టేలా 'లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్' విధానాన్ని తేవాలని వారు గళమెత్తారు. ఆన్‌లైన్ మందుల విక్రయాలు కేవలం స్థానిక వ్యాపారుల పొట్టకొట్టడమే కాకుండా, డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు చేరడం వల్ల ప్రజారోగ్యానికే ముప్పుగా పరిణమిస్తుందనే నిఖార్సైన నిజాన్ని ఈ సందర్భంగా నేతలు నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు పసుమర్తి లక్ష్మణరావు, కోశాధికారి జహీర్ అహ్మద్, జిల్లా జాయింట్ సెక్రటరీ కొత్తూరు రామారావు, ఈసీ సభ్యులు అంబోజు సారయ్యలతో పాటు మున్సిపల్ వైస్ ఛైర్మన్ పెండ్యాల రాజు, సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బంధు సూర్యం తదితరులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు. డిజిటల్ వ్యాపారాల మోజులో పడి, అర్ధరాత్రి ఆపద వస్తే షాప్ తెరిచి మందులిచ్చే 'స్థానిక మెడికల్ షాప్' వ్యవస్థను కోల్పోతే ఆ నష్టం సమాజానికేననే గట్టి సందేశాన్ని ఈ బంద్ నోటీసు ఇల్లందు వేదికగా పాలకులకు పంపింది.

జన సంఘర్షణ
మంగళవారం
19 మే 2026

# భద్రాద్రి పవిత్రతకు 'మద్యం' తూట్లు.. ఆబ్కారీ అండతోనే అక్రమ దందా?

- రాముడి నీడలో 'చీకటి' దందా: భద్రాచలంలో మద్యం మాఫియా అరాచకం
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ.. భద్రాద్రి భక్తులకు తప్పని మద్యం నరకం
- సిండికేట్ గుప్పిట్లో భద్రాచలం: గల్లీ గల్లీనా 'బెల్ట్' రక్కసి.. పాలకులారా ఇకనైనా మేల్కొనండి

భద్రాచలం మే 18 (జన సంఘర్షణ)

కోట్లాది మంది భక్తుల నమ్మకానికి, ఆధ్యాత్మికతకు నిలయమైన భద్రాద్రి రాముని పుణ్యక్షేత్రం నేడు మద్యం మాఫియా గుప్పిట్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. భక్తిభావంతో విరాజిల్లాల్సిన ఈ పవిత్ర నగరంలో, కేవలం కాసుల కక్కుర్తే పరమావధిగా సాగుతున్న 'బెల్ట్' భాగోతం నానాటికీ విస్తరిస్తోంది. చట్టాన్ని అమలు చేయాల్సిన వారే అక్రమార్కులకు అండగా నిలుస్తుండటంతో, గల్లీ గల్లీనా మద్యం ఏరులై పారుతోంది. సాక్షాత్తు ఆలయ పరిసరాలను సైతం వదలకుండా సాగుతున్న ఈ నయా దందా, భద్రాచలం ఉనికిని, ప్రతిష్టను మసకబారుస్తుండటం ఇక్కడి తీవ్రమైన పరిస్థితికి అద్దం పడుతోంది. పట్టణ వ్యాప్తంగా దాదాపు మూడు వందలకు పైగా అనధికారిక విక్రయ కేంద్రాలు యథేచ్ఛగా నడుస్తున్నాయంటే, ఇక్కడ ఎక్సైజ్ శాఖ నిఘా ఎంత 'సమర్థవంతంగా' ఉందో అర్థం చేసుకోవచ్చు. లైసెన్స్ ఉన్న వైన్ షాపుల యాజమాన్యాలు ఒక సిండికేట్‌గా ఏర్పడి, ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతూ ఈ సమాంతర వ్యవస్థను నడిపిస్తున్నాయి. ఉదయం నిర్ణీత సమయం కంటే ముందే, రాత్రి వేళల్లో అధికారిక దుకాణాలు మూసేసిన తర్వాత కూడా ఈ రహస్య కేంద్రాల ద్వారా విక్రయాలు సాగిస్తున్నారు. సమయాన్ని బట్టి ఒక్కో సీసాపై ఇష్టారాజ్యంగా అదనపు ధరలు వసూలు చేస్తూ మద్యం ప్రియులను నిలువునా దోచుకుంటున్నారు. ఈ అక్రమ మద్యం వరద వల్ల స్థానిక శాంతిభద్రతలు పూర్తిగా క్షీణిస్తున్నాయి. అర్ధరాత్రి దాటినా విచ్చలవిడిగా మత్తు లభిస్తుండటంతో, వ్యసనాలకు బానిసలవుతున్న కొందరు యువకులు ప్రధాన రహదారులపై, కూడళ్లలో అరాచకాలకు తెరతీస్తున్నారు. రాత్రి సమయాల్లో పనుల నిమిత్తం వెళ్లే స్థానిక మహిళలు, సుదూర ప్రాంతాల నుండి వచ్చే మహిళా భక్తులు ఈ మందుబాబుల అసభ్య ప్రవర్తనతో, వేధింపులతో నిత్యం నరకం చూస్తున్నారు. శాంతిభద్రతలను కాపాడేందుకు స్థానిక పోలీసులు తమ పరిధిలో గట్టిగా కట్టడి చేస్తున్నప్పటికీ, మూల కారణమైన బెల్ట్ షాపులను నిర్మూలించాల్సిన ఎక్సైజ్ శాఖ మాత్రం చేష్టలుడిగి చూడటం వెనుక ఉన్న మతలబు ఏమిటనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ చీకటి వ్యాపారం ఇంత నిస్సిగ్గుగా సాగడం వెనుక స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) పాత్రపై తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిండికేట్ నిర్వాహకుల నుంచి నెలనెలా అందుతున్న లక్షలాది రూపాయల ముడుపుల మత్తులోనే సదరు అధికారి తనిఖీలకు వెనకడుగు వేస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. విధి నిర్వహణను పక్కనబెట్టి,






అక్రమార్కులకు రక్షణ కవచంగా మారిన సదరు అధికారి తీరుపై పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన స్థానంలో ఉన్నవారే ఇలా లంచాలకు లొంగిపోతే, సామాన్యుడికి రక్షణ ఎక్కడుంటుందనే ప్రశ్న తలెత్తుతోంది. మరింత విచారకరమైన విషయమేమిటంటే, ఈ అక్రమ దందాను సాక్ష్యాధారాలతో సహా నిలదీస్తూ స్థానిక పత్రికలు, ప్రజలు ఎప్పటికప్పుడు గళమెత్తుతున్నా ఉన్నతాధికారుల తీరులో మార్పు రాకపోవడం. బాధ్యతాయుతమైన సమాధానం చెప్పాల్సిన స్థానంలో ఉన్నవారు, ఈ దందాను కప్పిపుచ్చే ధోరణిలో వ్యవహరించడం పరాకాష్టకు నిదర్శనం. నిబంధనలను అతిక్రమించి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడానికి బదులు, గుంభనంగా వ్యవహరించడం చూస్తుంటే.. ఈ మద్యం సిండికేట్ వెనుక ఎంతటి పెద్ద తలకాయల హస్తం ఉందో, అవినీతి మూలాలు ఎంత లోతుగా పాతుకుపోయాయో స్పష్టమవుతోంది. రాజకీయ ప్రయోజనాలు, వ్యక్తిగత స్వార్థాల కోసం ఒక పవిత్ర పుణ్యక్షేత్రాన్ని ఇలా మద్యం అరాచకాలకు నిలయంగా మార్చడం ఎంతవరకు సమంజసం? కేవలం ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయం, అధికారుల జేబులు నిండే మామూళ్లే పరమావధిగా భావిస్తే, రేపటి తరం భవిష్యత్తు ఏమవ్వాలి? ఎంతోమంది యువత ఈ వ్యసనాల బారిన పడి కుటుంబాలను రోడ్డున పడేస్తుంటే, సమాజ రక్షణే ధ్యేయంగా పనిచేయాల్సిన శాఖలు కళ్లుండి చూడలేని కబోదుల్లా వ్యవహరించడం మన సామాజిక దిగజారుడుతనానికి నిదర్శనం కాదా అని మేధావులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక అధికారులు సిండికేట్ తో చేతులు కలిపిన వేళ.. ఇక జిల్లా స్థాయి ఉన్నతాధికారులే ఈ అరాచకానికి అడ్డుకట్ట వేయాల్సి ఉంది. కేవలం కాగితాలకే పరిమితమయ్యే మొక్కుబడి తనిఖీలు కాకుండా, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భద్రాచలం పట్టణాన్ని, పరిసర ఏజెన్సీ ప్రాంతాలను ఈ మద్యం రక్కసి నుండి కాపాడటంలో జిల్లా యంత్రాంగం చూపే చొరవపైనే ఇక్కడి ప్రజల నమ్మకం ఆధారపడి ఉంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ ఉన్నతాధికారులు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో రంగంలోకి దిగి, భద్రాచలంలోని అన్ని బెల్ట్ షాపులను తక్షణమే సీజ్ చేయాలి. అలాగే, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, అక్రమార్కులతో కుమ్మక్కై పవిత్ర పుణ్యక్షేత్రానికి కలంకం తెస్తున్న స్థానిక ఎక్సైజ్ అధికారులపై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని భద్రాద్రి ప్రజలు, మహిళా సంఘాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. పాలకులారా.. ఇకనైనా మేల్కొనండి, భద్రాద్రి పవిత్రతను కాపాడండి.

# త్రివేణి సంగమానికి పుష్కర శోభ

- 21 నుంచి సరస్వతి అంత్య పుష్కరాలు
- కాళేశ్వరంలో ముమ్మరంగా సాగుతున్న ఏర్పాట్లు
- 12 రోజుల పాటు మూడు నదుల సంగమంలో ఆధ్యాత్మిక సందడి
- గోదావరి తీరంలో బారికేడ్లు
- ఘాట్ల వద్ద వసతుల కల్పన ఏర్పాట్లనుపర్యవేక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్

కాకతీయ భూపాలపల్లి : /మే 18 (జన సంఘర్షణ)

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర త్రివేణి సంగమ తీరం సరస్వతి అంత్య పుష్కరాలకు సిద్ధమవుతోంది. మే 21వ తేదీ (గురువారం) నుంచి జూన్ 1వ తేదీ వరకు 12 రోజుల పాటు అత్యంత వైభవంగా జరగనున్న ఈ అంత్య పుష్కరాల కోసం జిల్లా యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లను ముమ్మరం చేసింది. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నదుల కలయిక అయిన ఈ పవిత్ర తీరంలో పుష్కర స్నానాలు ఆచరించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. పుష్కరాలకు సమయం తక్కువగా ఉండటంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ స్వయంగా రంగంలోకి దిగి పనులను పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రద్దీని తట్టుకునేలా ప్రధాన ఘాట్‌తో పాటు సరస్వతి ఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నదిలో నీటి మట్టాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, భక్తులు లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా ఉండేందుకు ప్రతి 50 మీటర్లకు రక్షణ బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యగా





అనుభవజ్ఞులైన గజఈతగాళ్లను ఘాట్ల వద్ద అందుబాటులో ఉంచుతున్నారు. నదిలోకి దిగే భక్తులు జారిపడకుండా ఉండేందుకు క్వయర్ మ్యాట్లను పరుస్తున్నారు.పుష్కరాలకు వచ్చే మహిళా భక్తుల సౌకర్యార్థం ఘాట్ల వద్ద తగినన్ని బట్టలు మార్చుకునే గదులను, తాత్కాలిక షవర్ ట్యాప్స్‌ను నిర్మిస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రధాన ఘాట్ నుంచి సరస్వతీ ఘాట్ వరకు నిర్మించిన తాత్కాలిక రహదారులపై దుమ్ము లేవకుండా నిరంతరం నీటిని చల్లేందుకు ఏర్పాట్లు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వసతికి టెంట్ సిటీ, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రముఖులు, వివిఐపిల రాక కోసం హెలిప్యాడ్‌ను సిద్ధం చేసి, దాని చుట్టూ రక్షణ బ్యారికేడ్లను నిర్మిస్తున్నారు. కాళేశ్వరం వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రధాన కూడళ్లలో సైన్ బోర్డులు, రంగురంగుల లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక మ్యూజియంలోని ప్రతి విగ్రహం వద్ద భక్తులకు అర్థమయ్యేలా పూర్తి సమాచార బోర్డులను ఉంచుతున్నారు. ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి పనులను బుధవారం సాయంత్రానికి పూర్తి చేసేలా రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు.

## ఖమ్మం - భద్రాచలం ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త

భద్రాచలం మే 18 (జన సంఘర్షణ)



ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సరీరాం ఒక శుభవార్త చెప్పారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఖమ్మం-భద్రాచలం రూట్లో నడిచే 7 డీలక్స్ బస్సుల స్టేజీలను కుదించినట్లు తెలిపారు. ఈ బస్సులు ఇకపై వైరా, ఏన్కూరు, కొత్తగూడెం, పాల్వంచ స్టేజీలలో మాత్రమే ఆగుతాయన్నారు. దీనివల్ల సమయం కలిసివచ్చి ప్రయాణికులు గమ్యస్థానాలకు త్వరగా చేరుకుంటారని ఆయన పేర్కొన్నారు.

## పోతంగల్ మండల నూతన ఎమ్మార్వోగా బాధ్యతలు స్వీకరించిన సందీప్

పోతంగల్ /మే 18/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం గత ఎమ్మార్వో విష్ణు స్థానంలో సోమవారం నూతన ఎమ్మార్వోగా సందీప్ బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా పోతంగల్ మండల ప్రెస్ క్లబ్ కమిటీ ఎమ్మార్వో సందీప్‌కి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అర్జున్ , ఉపాధ్యక్షుడు గంధపు దత్తు, యాదవరావు, లక్ష్మణ్, సురేష్, అజారుద్దీన్, శ్రీకాంత్, జన సంఘర్షణ, డిఈఓ, సిఓ మల్లేష్, అక్బర్ నగర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# పదవుల కలయిక.. ప్రజాసేవకే సంకేతం



భద్రాచలం మే 18 (జన సంఘర్షణ)

రాజకీయాల్లో పదవులు అనేవి కేవలం అధికార కేంద్రాలు కావు, అవి సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడే అస్త్రాలు అని నిరూపిస్తూ.. భద్రాద్రి వేదికగా ఇద్దరు కీలక నేతల ఆత్మీయ కలయిక ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణ రాష్ట్ర పెటిక కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బుడగం శ్రీనివాస్, సోమవారం తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు పొదెం వీరయ్యని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పొదెం వీరయ్య కూడా నూతన వైస్ చైర్మన్‌ను ఆత్మీయంగా అభినందిస్తూ, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించింది. కేవలం అభినందనలకే పరిమితం కాకుండా, అడవిని ఆశ్రయించి బతికే గిరిజనుల శ్రేయస్సు (ఫారెస్ట్ కార్పొరేషన్) మరియు సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి (పెటిక కార్పొరేషన్) పరస్పర సమన్వయంతో సాగినప్పుడే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందనే విశ్లేషణాత్మక సందేశాన్ని ఈ కలయిక గుర్తుచేస్తోంది. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతరేల రవికుమార్, కాంగ్రెస్ నేతలు తమ్మిళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని, కొత్త-పాత నాయకత్వాల కలయికతోనే ప్రజాక్షేత్రంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నాయకుడి నిష్క్రమణ.. ఆదివాసీ గొంతుకకు తీరని లోటు

దుమ్ముగూడెం /భద్రాచలం మే 18 (జన సంఘర్షణ)



సమాజంలో ఎంత సంపాదించామన్నది కాదు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ఎంతగా పోరాడామన్నదే ఒక నాయకుడి నిజమైన వ్యక్తిత్వాన్ని నిర్వచిస్తుంది. ఆదివాసీ హక్కుల రక్షణకై, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికై అహర్నిశలు శ్రమించిన అరుదైన నిస్వార్థ నేత, కీ.శే. తెల్లం నరేష్ గారి అకాల మరణం భద్రాచలం ఏజెన్సీ ప్రాంతానికి ఒక తీరని లోటుగా మిగిలిపోయింది. దుమ్ముగూడెం మండలం సీతానగరం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఆయన 'పెద్దకర్మ' కార్యక్రమానికి భద్రాచలం నియోజకవర్గ ఆదివాసీ సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు భారీగా తరలివచ్చి, నరేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి అశ్రునయనాలతో ఘన నివాళులు అర్పించారు. భద్రాచలం ఆదివాసీ సమితి (దూూ) అధ్యక్షులు, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ పాయం రవివర్మ, హైకోర్టు న్యాయవాది పెనుబల్లి రమేష్ బాబు, సీనియర్ నేత బట్టా విజయ్ గాంధీ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు కుంజా రమాదేవిలతో పాటు కుంజా శ్రీను, శీలం దుర్గా, ఉబ్బా వేణు, ఇర్ప రవి, సుధీర్ కుమార్ తదితర ప్రముఖులు ఈ నివాళులర్పించిన వారిలో ఉన్నారు. మనుషులు భౌతికంగా దూరమైనా, హక్కుల పోరాటంలో వారు వేసిన అడుగులు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయని.. నరేష్ ఆశయ సాధనే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని ఈ సందర్భంగా నేతలు పేర్కొనడం, హక్కుల పోరాటంలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది.

## దప్పిక తీర్చిన నిధులు.. 'పాయం' స్పందనకు జనం హర్షం

అశ్వాపురం, మే 18 (జనసంఘర్షణ)





రాజకీయాల్లో హామీలు ఇవ్వడం సులువే అయినా.. ఎండ తీవ్రతకు జనం విలవిల్లాడుతున్న వేళ, వారి గొంతు ఎండకుండా తక్షణమే స్పందించి కార్యాచరణకు పూనుకోవడమే అసలైన ప్రజాస్వామ్య విలువలకు నిదర్శనం. ఈ క్రమంలోనే, వేసవి కాలంలో తాగునీటి ఎద్దడితో సతమతమవుతున్న అశ్వాపురం మండలంలోని పలు గ్రామాల ప్రజల ఇబ్బందులపై పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గారు చూపిన చొరవ అభినందనీయం. మండల పరిధిలోని చింతిర్యాల, రామచంద్రాపురం గ్రామ పంచాయతీల్లో నెలకొన్న తీవ్ర నీటి సమస్యను స్థానిక సర్పంచ్‌లు, కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఏమాత్రం ఆలస్యం చేయకుండా, అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించి నూతన హ్యాండ్ బోర్లు, మోటార్ల ఏర్పాటు కోసం రూ.14 లక్షల భారీ నిధులను తక్షణమే మంజూరు చేశారు. ఇందులో భాగంగా చింతిర్యాల పంచాయతీ పరిధిలోని కట్టంవారిగూడెం, పాత చింతిర్యాల ప్రాంతాలకు రూ.10 లక్షలు, అలాగే రామచంద్రాపురం, సత్యనారాయణపురం గ్రామాలకు రూ.4 లక్షలు కేటాయించి యుద్ధప్రాతిపదికన బోర్ల పనులు పూర్తి చేయించడం ద్వారా ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపారు. ఎండకాలంలో ఒక ఊరి దప్పిక తీర్చడం కంటే మించిన సామాజిక సేవ మరొకటి లేదని, సమస్య చిన్నదా పెద్దదా అని చూడకుండా స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారి నిబద్ధత ప్రజాప్రతినిధుల బాధ్యతకు అద్దం పడుతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా తమ ఆపదను గుర్తించి నీటి గోస తీర్చిన పాయం వెంకటేశ్వర్లు కి ఆయా గ్రామాల ప్రజానీకం, పార్టీ శ్రేణులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



## బాన్సువాడ డి.ఎస్.పి కార్యాలయంలో శాంతి సమావేశం



- ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు
- బాన్స్వాడ డిఎస్పి విట్టల్ రెడ్డి

బాన్సువాడ/మే18/(జన సంఘర్షణ)

బాన్సువాడ డి.ఎస్.పి ఆఫీస్ నందు బాన్సువాడ పోలీస్ స్టేషన్ అధికారి , డీఎస్పీ విఠల్ రెడ్డి ఆధ్వర్యంలో బాన్సువాడ పట్టణం లోని ముస్లిం , హిందూ మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. రాబోవు బక్రీద్ పండుగ సందర్భంగా ఇట్టి శాంతి కమిటీ నిర్వహించారు. ముస్లిం , హిందూ మతం మతపెద్దలు, పాల్గొనటం జరిగింది. అందరూ సోదర భావంతో పండుగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని బాన్స్వాడ డి.ఎస్.పి విట్టల్ రెడ్డి సూచించారు. మత ద్వేషాలకు రెచ్చగొట్టే వారిని ఎప్పటికప్పుడు తమ నిగా ఉంటుందని, ప్రశాంత వాతావరణంలో పల్లెల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని డిఎస్పి విట్టల్ రెడ్డి హెచ్చరించారు.

## బోధన్ మండలం రాంపూర్ గ్రామంలో నీటి కొరత

బోధన్ మండలం రాంపూర్/మే 18/(జన సంఘర్షణ)



వేసవి కాలంలో నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి రాకుండా గ్రామపంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, మరమత్తులకు నోచుకోలేని బోర్లను బాగు చేయించి నేటి సౌకర్యం అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేసనప్పటికీ క్షేత్రస్థాయిలోఅమలు కావడం లేదు. బోధన్ మండలం రాంపూర్ గ్రామంలో దళిత కాలనీలో గల మోటర్ మరమ్మత్తులకు నోచుకోలేక 20 రోజులు గడుస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవటం లేదు అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి ఎద్దడితో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోకపోవడం గుక్కెడు మంచినీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . దళిత కాలనీలో ఉన్న నీటి సమస్యను ఇప్పటికైనా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఈతకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు మృతి

- పిల్లల పట్ల తల్లిదండ్రులు దృష్టి సారించలేకపోవడంతో తెలంగాణలో వరుస ఘటనలు



సంగారెడ్డి జిల్లా/మే18/(జన సంఘర్షణ)

వేసవి కాలం నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ఇవ్వడం పట్ల విద్యార్థులు చెరువు కట్టల వద్దకు, కాలువల వద్దకు, కుంటల వద్దకు, బావుల వద్దకు వెళ్లకుండా కన్న తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలని పదే పదే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రులు, జిల్లాల కలెక్టర్లు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించినప్పటికీ వారు స్పందించకపోవడం వల్ల చిన్నారులు ఈత కోసం వెళ్లి జల సమాధి అవుతున్నారు. నవ మాసాలు మోసి కని పెంచి పెద్ద చేసిన కన్న పిల్లలు దూరం అవుతుంటే ఆ తల్లిదండ్రుల గోస ఇంత అంత కాదు. ఇటీవల చెరువులలో, కాల్వలలో పడి చిన్నారులు మృతి చెందిన ఘటనలో ఎన్నో వెలుగులోకి వచ్చాయి తాజాగా.సంగారెడ్డి జిల్లా రామోజీపల్లిలో ఆదివారం రాత్రి విషాదం చోటుచేసుకుంది. సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన నిరంజన్ (12), మున్నూరు బసలింగం (14), మున్నూరు మనోజుమార్ (8) అనే ముగ్గురు చిన్నారులు నల్లవాగులో తీసిన గుంతలోని నీటిలో ప్రమాదవశాత్తు మునిగి మరణించారు. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెతకగా, పిల్లల దుస్తులు, చెప్పులు గుంత ఒడ్డున కనిపించాయి. సమాచారం అందుకున్న పోలీసులు, మత్స్యకారుల సహాయంతో గాలించగా ముగ్గురు బాలుర మృతదేహాలు లభ్యమయ్యాయి.

## కండక్టర్ నిజాయితీ... ప్రయాణికుడు పోగొట్టుకున్న బ్యాగు ప్రయాణికుడికి అందజేత

- బ్యాగులో విలువైన బంగారం, విలువైన డాక్యుమెంట్స్ పత్రాలు

హైదరాబాద్ జేబీఎస్ నిజామాబాద్/ మెదక్/మే 18/(జన సంఘర్షణ)




ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులో ఓ ప్రయాణికుడు మర్చిపోయిన విలువైన బంగారం, డాక్యుమెంట్లు ఉన్న బ్యాగు ను గుర్తించి కండక్టర్ సంబంధిత వ్యక్తికి అందజేసి తన నిజాయితీని నిరూపించుకున్నారు. వివరాలను వెళితే గంగారం అనే కండక్టర్ స్వగ్రామం స్వగ్రామం బరంకేడిగి... డ్యూటీ నిజామాబాదు 2 వ డిపో కండక్టర్ గ విధులు నిర్వహిస్తున్నారు.. సోమవారం నిజామాబాదు నుండి బాన్స్వాడ, మెదక్ మీదుగా సికింద్రాబాద్ జె బి ఎస్ బస్టాండ్ వరకు వెళ్లే బస్సులు కండక్టర్గా గంగారం విధులు నిర్వహించారు. మహాత్మా గాంధీ బస్టాండ్ చేరుకున్న బస్సులో ఓ యువకుడు బంగారం, విలువైన డాక్యుమెంట్లతో ఉన్న బ్యాగును మర్చిపోయారు. బస్సులో సీటుపై ఓ బ్యాగు కండక్టర్కు గంగారంకు కనిపించడంతో ఆ బ్యాగు తీసి చూడగా దాంట్లో బంగారం, నగదు డాక్యుమెంట్లు ఉన్నాయి. ఇవి ఎవరి అని ఆరా తీస్తుండగా పో యువకుడు తాను బస్సులో బ్యాగు మర్చిపోయినట్లు ఫోన్ చేయడంతో కండక్టర్ గంగారం, బ్యాగు పోగొట్టుకున్న వ్యక్తిని చార్జింగ్ చేసే స్థలానికి పిలిపించుకొని ఆ వ్యక్తికి బ్యాగులు ఇచ్చి తన నిజాయితీని చాటుకున్నారు కండక్టర్ గంగారం. జాగ్రత్తగా పరిశీలన చేసి బ్యాగుకు సంబంధించిన వ్యక్తికి అధికారుల సమక్షంలో అందజేశారు. కండక్టర్ నిజాయితీ పట్ల ఆర్టీసీ ఉన్నత అధికారులు అభినందనలు తెలిపారు.

## రుద్రూర్ శివారులోని వ్యవసాయ పాలిటెక్నిక్ జగిత్యాల కళాశాలలో విలీనం చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తాం

- కళాశాల ముందు అఖిలపక్ష విద్యార్థుల సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

రుద్రూర్, వర్ని ప్రతినిధి /మే 18/(జన సంఘర్షణ)







నిరుపేద ప్రాంత విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఏర్పడిన రుద్రూర్ చెరుకు వరి పరిశోధనల కేంద్రంలో నెలకొల్పబడిన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను జగిత్యాల లోని కళాశాలలో విలీనం చేయడానికి అధికార యంత్రాగం సిద్ధమైంది. దీనిని వ్యతిరేకిస్తూ సోమవారం ఉదయం అఖిలపక్ష విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. కళాశాలను జగిత్యాల్ కు తరలిస్తే సహించేది లేదంటూ విద్యార్థుల సంఘ నాయకులు హెచ్చరించారు. కళాశాల ముందు ధర్నా నిర్వహించి అధికారుల, పాలకుల నిర్లక్ష్యం పట్ల తీవ్రంగా మండిపడ్డారు. 2005లో ఏర్పాటైన వ్యవసాయ పనిని కళాశాలను ఈ ప్రాంత ప్రజలకు సేవలు అందించకుండా జగిత్యాలకు తరలించడం ఏమిటని విద్యార్థి సంఘాలు ప్రశ్నించాయి. స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థి సంఘాలు విద్యార్థి చేస్తున్నాయినిజామాబాద్ జిల్లారుద్రూర్ మండల అఖిలపక్ష. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం అక్బర్ నగర్ లో గల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను జగిత్యాల లోని కళాశాలలో విలీనం చేయడానికి ప్రభుత్వం యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు దానికి సంబంధించిన ప్రొసీడింగ్ ఆర్డర్స్ కూడా యూనివర్సిటీ అధికారులు సంబంధిత అధికారులకు పంపించడం జరిగింది. ఈ విద్యా సంవత్సరం 2026 – 27 సంబంధించిన అడ్మిషన్లు ఇక అక్బర్ నగర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో జరగవని జగిత్యాలలోని పోలాస కళాశాలలో విలీనం చేస్తున్నట్లు నిర్ణయించారు .దీనికి అఖిలపక్షం విద్యార్థి సంఘాలు పూర్తిగా వ్యతిరేకిస్తుంది .విద్యాభివృద్ధి చేస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నేడు ఉన్న కళాశాలలను మూసివేసి , విలీనం పేరుతో విద్యార్థులకు సాంకేతిక విద్య దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారు అంటూ వారు ఆరోపించారు.అక్బర్ నగర్ లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కళాశాల నడపడానికి అన్ని సౌకర్యాలు ఉన్న ఇక్కడ విద్యార్థులు లేరు అనే నేపంతో కళాశాలను తరలించాలని చూస్తున్నారు ఇక్కడ విద్యార్థులకు హాస్టల్ వసతి, సరిపడా తరగతి గదులు ప్రాక్టికల్ గా తెలుసుకోవడానికి వ్యవసాయ భూమి అన్ని రకాల శాస్త్రవేత్తలు అధ్యాపకులు అందుబాటులో ఉన్న కూడా ఇక్కడి నుంచి ఈ కళాశాల తలలించే క్రమంలో ఇదంతా జరుగుతున్నదని కొంత మంది అధికారులు కూడా దీనికి ప్రయత్నాలు చేస్తున్నారు అని మేము భావిస్తున్నాం. నిజామాబాద్ జిల్లా విద్యార్థులకు మోసం చేయడం అవుతుందని అన్నారు, ఇదే జరిగితే విద్యార్థులు అందరినీ ఏకం చేసి యూనివర్సిటీ కి తాళం వేస్తాం అని హెచ్చరిస్తున్నాం, విద్యార్థుల అడ్మిషన్స్ ఏ విధంగా పెంచుకోవాలని చూడాలి తప్ప ఉన్న కళాశాల మూసివేయడం సరికాదు, ప్రభుత్వం విద్యను బలవంతం చేయలే తప్ప కొనసాగే కళాశాలను మూసివేయడం సబబుకాదని విద్యార్థి సంఘాల నాయకులు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఒకటే ఉన్నది. కావున దీని దృష్టిలో ఉంచుకొని కళాశాలలను ఈ విద్యా సంవత్సరం ఇక్కడి నుంచే కొనసాగించాలని, ఇచ్చిన ప్రొసీడింగ్ ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఇల్లందులో కొలువుల కుంభకోణం



- పోలీసుల నుండి ఎస్కేప్ అవ్వాలని చూసి.. చివరికి బుక్కైన ఇల్లందు కాంట్రాక్టర్
- సింగరేణి ఉద్యోగాల పేరుతో భారీ వసూళ్లు.. వరంగల్ పోలీసులకు చిక్కిన లోకేష్
- ఉద్యోగాల 'ఎర'.. రూ.70 లక్షల దందా వెనుక అసలు సూత్రధారులెవరు?

ఇల్లందు, మే 18 (జనసంఘర్షణ)

నిరుద్యోగమే పెట్టుబడిగా, అమాయక యువత ఆశలే ముడిసరుకుగా ఏజెన్సీ ప్రాంతాల్లో నయా వంచకులు రెచ్చిపోతున్నారు. కొలువుల కొరతతో అల్లాడుతున్న యువత బలహీనతలను ఆసరాగా చేసుకుని, లక్షలాది రూపాయలు గుంజుతున్న ఒక పెద్ద నెట్‌వర్క్ గుట్టు రట్టయింది. ఉద్యోగాల పేరిట గిరిజన, వెనుకబడిన ప్రాంతాల నిరుద్యోగులను నమ్మించి, ఏకంగా రూ.70 లక్షలు వసూలు చేసిన లోకేష్ అనే కేటుగాడిని వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం ఇల్లందులో అత్యంత వ్యూహాత్మకంగా అదుపులోకి తీసుకోవడం స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ప్రభుత్వ, సింగరేణి కొలువులు ఇప్పిస్తానంటూ సదరు నిందితుడు నిరుద్యోగ కుటుంబాలకు పెద్ద మొత్తంలో ఆశ చూపాడు. అప్పులు చేసైనా పిల్లల భవిష్యత్తు బాగుంటుందని నమ్మిన ఎంతోమంది తల్లిదండ్రులు తమ కష్టార్జితాన్ని నిందితుడి చేతిలో పెట్టారు. తీరా నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోగా, ఇచ్చిన డబ్బులు సైతం వెనక్కి ఇవ్వకుండా తిప్పించుకోవడంతో బాధితులకు మోసపోయామని ఆలస్యంగా అర్థమైంది. దీంతో బాధితులు లబోదిబోమంటూ వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ నయా దందా వెలుగుచూసింది.కేసు నమోదు చేసుకున్న వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి నిందితుడి ఆచూకీ కోసం ఇల్లందులో నిఘా పెట్టారు. పోలీసుల రాకను గమనించిన నిందితుడు లోకేష్ సినిమా ఫక్కీలో వారి నుంచి తప్పించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, అప్రమత్తమైన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అతడిని చాకచక్యంగా వెంటాడి పట్టుకున్నారు. ఇతడు ఇల్లందు మున్సిపాలిటీతో పాటు సింగరేణిలో కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడని, ఆ పరిచయాలతోనే తాకిడి ఉన్న పెద్ద పెద్ద అధికారుల పేర్లు వాడుకుంటూ నిరుద్యోగులకు ఎర వేసినట్లు విచారణలో ప్రాథమికంగా తెలిసింది. అయితే, కేవలం ఇల్లందులోనే ఒక సాధారణ కాంట్రాక్ట్ పనులు చేసుకునే వ్యక్తి ఇంత ధైర్యంగా రూ.70 లక్షలు వసూలు చేయడం వెనుక రాజకీయ, అధికార వర్గాల హస్తం ఉందా అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. తెర వెనుక ఉన్న పెద్ద తలకాయల అండ చూసుకునే ఈ స్థాయి వసూళ్లకు పాల్పడ్డాడా, లేక ఇదంతా ఒక వ్యవస్థీకృత ముఠా పనేనా అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. కేవలం ఒక మోసగాడిని అరెస్ట్ చేయడంతో సరిపెట్టకుండా, ఈ అక్రమ వసూళ్ల నెట్‌వర్క్ మూలాలను కూడా పూర్తిగా తొలగించడమే నిజమైన న్యాయం. ఈ ఘోర ఉదంతం నిరుద్యోగ లోకానికి ఒక గట్టి హెచ్చరిక లాంటిది. ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం అర్హత, ప్రతిభ అధికారిక నోటిఫికేషన్ల ద్వారా మాత్రమే లభిస్తాయనే కనీస సత్యాన్ని యువత ఎందుకు విస్మరిస్తోందనేది ఇక్కడ మిగిలిన ప్రశ్న. కష్టపడి చదివే కన్నా, దొడ్డిదారిన ఉద్యోగాలు సాధించవచ్చనే భ్రమలు వీడనంత కాలం ఇలాంటి లోకేష్‌లు పుట్టుకొస్తూనే ఉంటారు. ఇప్పటికైనా నిరుద్యోగులు, తల్లిదండ్రులు దళారుల మాటలు నమ్మి లక్షలాది రూపాయలు పోగొట్టుకోవద్దని, కళ్లెదుట మోసాలు జరుగుతుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని మేధావులు కోరుతున్నారు.

## తండ్రి హెడ్ కానిస్టేబుల్.... తనయుడు డాక్టర్

- హెడ్ కానిస్టేబుల్ కుమారుడిని అభినంధించిన పోలీస్ కమీషనర్

నిజామాబాద్/మే 18/(జన సంఘర్షణ)




ఎమ్.బి.బి.ఏస్ శిక్షణ పూర్తి చేసిన సందర్భముగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ బాశెట్టి శ్రీనివాస్ హెచ్. కుమారుడు శ్రేయస్సు కృష్ణ గ ఎమ్.బి.బి.ఎస్ శిక్షణ పూర్తి చేసిన సందర్భముగా సోమవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం యందు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, అభినందించారు ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగుల పిల్లలు ఉన్నత చదువులు చదివి, సమాజానికి ఉపయోగపడే వృత్తుల్లో స్థిరపడటం గర్వకారణమని పోలీస్ కమీషనర్ పేర్కొన్నారు. నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్‌లో సైబర్ క్రైమ్ లొ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ కుమారుడు శ్రేయస్సు కృష్ణ , కష్టపడి చదివి ఎమ్.బి.బి.ఎస్ పట్టా పొందారు. కష్టపడి చదివి డాక్టరుగా ఎదిగిన శ్రేయస్సు కృష్ణ ను ఆదర్శంగా తీసుకోవాలని , పోలీస్ సిబ్బంది పిల్లల చదువులకు తమ శాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.

## మన మల్లికార్జున్ కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు

- అగ్నిలా మాట...అమృతంలా మనసు...
- అదే మల్లికార్జున్ వ్యక్తిత్వం...!




కామారెడ్డి జిల్లా/మే 18/(జన సంఘర్షణ)

ప్రజల కన్నీటి చరిత్ర చదివిన నాయకుడు, బాధల భాష అర్థం చేసుకున్న మనిషి...పదవి కోసం కాదు, ప్రజల కోసం పోరాడే ప్రజానాయకుడు...! వేదికపై గర్జిస్తే అన్యాయం వణికిపోతుంది...ప్రజల మధ్య నడిస్తే ఆశలు చిగురిస్తాయి...!కాంగ్రెస్ జెండా కేవలం ఆయన భుజంపై కాదు, ఆయన గుండెలో ఎగురుతోంది... సత్యం కోసం స్వరం ఎత్తే ధైర్యం, సేవ కోసం జీవితం అర్పించే త్యాగం... ఆయన అడుగుల్లో కనిపించే మహోన్నత గుణాలు...! మల్లికార్జున్ అంటే ఒక పేరు కాదు... ప్రజల విశ్వాసానికి ప్రతిరూపం... పేదవాడి ఇంటి వెలుగు... యువతకు స్ఫూర్తి... జిల్లా రాజకీయాల్లో ఒక ధృవతార...! ఎన్ని తుఫాన్లు వచ్చినా నిలబడే పర్వతంలా...ఎన్ని విమర్శలు వచ్చినా నవ్వుతూ ముందుకు సాగే యోధుడిలా...!ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే నాయకుడు. మన మల్లికార్జున్...! కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు ఈ కార్యక్రమం తదితరులు పాల్గొన్నారు.

# ‘ఆమె’ స్వయంసమృద్ధికి రోటరీ భరోసా

◆ **సమాజ మార్పునకు సేవయే సాధనం: మహబూబాబాద్ రోటరీ క్లబ్ స్ఫూర్తియాత్ర**

మహబూబాబాద్ మే 18 (జన సంఘర్షణ)
మహబూబాబాద్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆరుగురు మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ జరిగింది; మహిళల ఆత్మగౌరవానికి, స్వయం ఉపాధికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, గత 18 ఏళ్లుగా ఈ క్లబ్ అందిస్తున్న బహుముఖ సేవలు అభినందనీయమని ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ నంబురి తిరుపతి రావు కొనియాడారు.

**సేవకు సరికొత్త నిర్వచనం**

కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, సమాజంలో నిశ్శబ్ద విప్లవానికి నాంది పలికేదే నిజమైన సేవ. ఆ సేవకు ఒక నిలువెత్తు రూపంగా నిలిచింది మహబూబాబాద్ రోటరీ క్లబ్. సోమవారం నాడు క్లబ్ అధ్యక్షుడు వేమిశెట్టి కిషోర్ కుమార్ అధ్యక్షతన జరిగిన మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం కేవలం ఒక పంపిణీ వేడుక కాదు; అది శతాబ్దాల నాటి రోటరీ అంతర్జాతీయ ఆశయాలకు స్థానిక అవసరాల మేళవింపు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మహబూబాబాద్ డీఎస్పీ నంబురి తిరుపతి రావు మాట్లాడుతూ, సమాజంలో సానుకూల మార్పు కోసం రోటరీ క్లబ్ చేస్తున్న కృషిని ఎంతో ‘భేష్’ అని ప్రశంసించారు.






**చికాగో వీధుల నుంచి మహబూబాబాద్ గడపల దాకా**

1920లో చికాగో నగరంలో పాల్ హ్యారీస్ ఆధ్వర్యంలో చిన్నగా ప్రారంభమైన రోటరీ ప్రస్థానం, నేడు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మైలురాళ్లను దాటుకుంటూ మానవతావాదానికి ప్రతీకగా నిలిచింది. శాంతిస్థాపన, పర్యావరణ పరిరక్షణ, విద్య, వైద్యం వంటి రంగాలతో పాటు నేటి సమాజానికి అత్యంత కీలకమైన ‘మహిళా సాధికారత’ను రోటరీ తన భుజస్కంధాలపై వేసుకుంది. ఆ అంతర్జాతీయ ఆశయ స్ఫూర్తిని పుణికిపుచ్చుకుని, మహబూబాబాద్ క్లబ్ వ్యవస్థాపకులు మాలె నాగేశ్వరరావు, వద్దుల సురేందర్ రెడ్డిల మార్గదర్శకత్వంలో స్థానిక అవసరాలకు అనుగుణంగా అడుగులు వేయడం క్లబ్ పరిణతికి నిదర్శనం.

**ఆత్మగౌరవానికి బాటలు.. స్వయంసమృద్ధికి ఊతం**

ఈ రోజు ఆరుగురు మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను అందజేయడం వెనుక ఉన్నది ఆర్థిక సాయం మాత్రమే కాదు, అంతకంటే మిన్నయిన ‘ఆత్మగౌరవం’. స్త్రీ సమాజంలో ఎవరిపైనా ఆధారపడకుండా, తన కాళ్లపై తాను నిలబడినప్పుడే అసలైన సాధికారత సాధ్యమవుతుంది. ఈ చిన్న యంత్రం రేపటి రోజున ఒక కుటుంబానికి జీవనోపాధిగా, ఆ మహిళకు ఆత్మవిశ్వాసంగా మారబోతోంది. టౌన్ సిఐ రఘుపతి రెడ్డి పేర్కొన్నట్టు, ఇటువంటి ప్రణాళికాబద్ధమైన సహాయం సమాజంలో నేరాల శాతాన్ని తగ్గించి, బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేయడంలో పరోక్షంగా దోహదపడుతుంది.

**ఎవరెస్ట్ శిఖరమంత ఎదిగిన 18 ఏళ్ల ప్రస్థానం**

గత పద్దెనిమిదేళ్లుగా మహబూబాబాద్ ప్రాంతంలో ఈ రోటరీ క్లబ్ సేవలు ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తుకు ఎదిగాయి. కేవలం ఒక రంగానికే పరిమితం కాకుండా.. విద్యార్థులకు టీవీలు, ల్యాప్‌టాప్‌లు, బెంచీలు; విద్యార్థినుల డ్రాపౌట్స్‌ను తగ్గించేందుకు సైకిళ్లు, రీయుజబుల్ శానిటరీ ప్యాడ్స్ అందించడం; స్వచ్ఛమైన నీటి కోసం వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం హర్షణీయం. అలాగే యువత స్వయం ఉపాధి కోసం గేదెల పంపిణీ, వికలాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి యంత్రాలు అందించడం ద్వారా ఈ క్లబ్ మానవత్వానికి అసలైన చిరునామాగా మారింది. గతం, వర్తమానంలాగే భవిష్యత్తులో కూడా ఈ సేవా చైతన్యం మరింత విస్తృతం కావాల్సిన అవసరం ఉంది.

**ఘన సన్మానం - సమిష్టి సంకల్పం**

కార్యక్రమం అనంతరం సమాజ రక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న డీఎస్పీ నంబురి తిరుపతి రావు, సీఐ రఘుపతి రెడ్డిలను రోటరీ క్లబ్ ప్రతినిధులు బొకే, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమిష్టి సంకల్పంలో రోటరీ క్లబ్ సెక్రెటరీ జంగాల విజయ్ కుమార్, డిస్ట్రిక్ట్ లీడర్ బిక్కి వెంకటేశ్వర్లు, లీగల్ అడ్వైజర్ తోర్నాల నగేష్ కుమార్, ట్రెజరర్ శంతన్ రామరాజుతో పాటు బోనగిరి గిరిధర్ గుప్తా, కొడారి నాగేందర్, గూడూరు నాగేశ్వరరావు, ముల్లంగి మోహన్ రెడ్డి, నాళ్ళ లక్ష్మి నరసింహారావు, దూదికట్ల సత్యం, జంగాల నర్సింహా రావు, తోడేటి వెంకన్న, వల్లాల రమేష్, జంగాల మంగపతి రావు, అచ్చ శ్రీనివాస్, కట్ల వెంకన్న, మాలె శ్రావణ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మన చుట్టూ ఉన్న సమాజానికి మనం ఏమి తిరిగి ఇస్తున్నామనే ఆలోచనను రేకెత్తించడమే ఈ రోటరీ సభ సాధించిన అసలైన విజయం.

# రేషన్ బియ్యం అక్రమ రవాణాపై చీత ఫోర్స్

నిజామాబాద్/మే 18/(జన సంఘర్షణ)
మూడు చోట్ల దాడులు ఏఏఏ 38 క్వింటాల పిడిఎస్ బియ్యం స్వాధీనం నిజామాబాద్ క్రైమ్. నిజామాబాద్ అక్రమ రవాణా కొనుగోలు చేస్తున్న పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిజాంబాద్ పోలీస్ కమిషనర్ సిపి. సాయి చైతన్య ఆదేశాల మేరకు సిసి ఎస్ ఏసిపి ఇన్చార్జ్ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో చీత ఫోర్స్, పోలీస్ సిబ్బంది సోమవారం తెల్లవారుజామున నుంచి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నగరంలో నాలుగవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రిలయన్స్ షాపింగ్ మాల్ ఎదుట రోడ్డుపై అనుమానస్తవంగా వెళ్తుండగా అశోక్ ల్యాండ్ వాహనం నెంబర్ టీఎస్ 16 యు సి 83 73ను పోలీసులు ఆపి తనిఖీ చేశారు. తనిఖీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 30 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ స్వాధీనం చేసుకున్న



బియ్యం, వహాన్ని తుది పరిచి విచారణ నియమితశీ 4 టౌన్ పోలీస్ స్టేషన్లో అప్పగించారు. నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్లో పరిధిలోని ముజాహిద్ నగర కాలిని గల అబ్దుల్ అల్తాఫ్ వద్ద అక్రమంగా కొనుగోలు చేసిన దాదాపు 6 క్వింటాల పిడిఎస్ రైస్ పట్టుకొని సంబంధిత పోలీసులకు అప్పగించడం. జరిగింది రెండవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముస్తయిద్ పుర కాలనీలో



గల సయ్యద్ సాజిద్ అలీ వద్ద రెండు కింటాలు పిడిఎస్ రైస్ స్వాధీనం చేసుకొని సంబంధిత ఎస్ హెచ్ ఓ కు అప్పగించడం జరిగింది. రేషన్ బియ్యం కొనుగోలు అక్రమ రవాణా పై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలోదర్యాప్తు కొనసాగి తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

## నిజాంబాద్ జిల్లా బోధన్: ప్రజావాణిలో 10 దరఖాస్తులు



బోధన్/మే 18/(జన సంఘర్షణ)
బోధన్ ఆర్డిఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్లో ప్రజావాణిలో 10 దరఖాస్తులు వచ్చాయని అధికారుల పేర్కొన్నారు. ఆడియో విజయకుమారి బాధితుల నుంచి వినతులను స్వీకరించి, ఆయా సమస్యలను త్వరగా పరిష్కరించాలని, అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం జరిగే ఈ ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు సాదివనియోగం చేసుకోవాలని ఆర్డిఓ సూచించారు.

## నిజామాబాద్ జిల్లాలో చీత ఫోర్స్ ప్రత్యేక దృష్టి

నిజామాబాద్/మే 18/(జన సంఘర్షణ)




అక్రమ ఇసుక తవ్వకాలు అక్రమ రవాణా వంటి కార్య కలపాలు చెట్టరీత్యా నేరమని జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కేసులు నమోదు చేస్తామని సిపి హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. జిల్లాలలో సహజ వనరుల సంరక్షణకు, అక్రమ వ్యాపారాల నియంతరనకు చీత ఫోర్స్ ప్రత్యేక దృష్టి పెట్టినట్టు పేర్కొన్నారు.

## బేగంపూర్ వద్ద రోడ్డు ప్రమాదం..

◆ **రేష్మ అనే మహిళ మృతి. భర్త, కుమార్తెకు తీవ్ర గాయాలు**
◆ **పెద్ద కొడపగల్‌లో ఘటన**



కామారెడ్డి పెద్ద కొడపగల్ /మే 18/(జన సంఘర్షణ)
తెలంగాణ రాష్ట్రంలోని రహదారులు రక్తంతో నడుస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ప్రతిరోజు ఏదో ఒకచోట ప్రమాదాలు జరగడం ఈ ప్రమాదంలో కొంతమంది ప్రాణాలు గాలిలో కలిసిపోవడం మరి కొంతమంది క్షతగాత్రులు మారి ఇంటికే పరిమితం అవుతున్నారు. తాజాగా కామారెడ్డి జిల్లా పెద్ద కొడ పగల్ మండలం బేగంపూర్ 161 జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బేగంపూర్ వద్ద గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న రేష్మ అక్కడికక్కడే మృతి చెందగా, భర్త, కుమార్తె తీవ్ర గాయలకు గురైంది. వీర్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

## కోయగూడెంలో సింగరేణి మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్స్ కార్యక్రమం



కోయగూడెం మే 18 (జన సంఘర్షణ)
ఇల్లందు ఏరియాలోని కోయగూడెం ఉపరితల గనిపై సోమవారం ‘మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్స్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోయగూడెం ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం. గోవిందరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ఇల్లందు ఏరియాలోని ఉద్యోగులందరికీ సింగరేణి సంస్థ గడిచిన 2025-26 ఆర్థిక సంవత్సరంలో సాధించిన విజయాలు, ఉత్పత్తి వివరాలను వివరించారు.

## డోంగ్లి మండల్ ధోతి గ్రామంలో మద్యం అమ్మితే రూ. 20 వేల జరిమానా... కేసు నమోదు



బిచ్కుంద/మే 18/(జన సంఘర్షణ)
డోంగ్లి మండల ధోతి గ్రామం కిరణా షాప్‌లో మద్యం వికరిస్తే రూ. 20 వేల జరిమానాతో పాటు కేసు నమోదు చేయాలని గ్రామస్తులు పంచాయతీ తీర్మానించారు. ఈ నిబంధన ఈనెల 20 నుంచి అమల్లోకి వస్తుంది. ఈనెల 15 గ్రామ పంచాయతీ కార్యక్రమంలో సర్పంచ్ సంగ్రామ్ పటేల్ అధ్యక్షతన గ్రామసభ సభ్యులు, గ్రామస్తుల సమీపంలో ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. తీర్మాన పత్రాలను డోంగ్లి తహసిల్దార్ రంజిత్ కుమార్, బిచ్కుంద, ఎక్సైజ్ ఎస్సై నగేష్, మద్నూర్ ఎస్సై మోహన్ రెడ్డి,లకు అందజేశారు. మద్యం వల్ల యువత చెడు దారి పడుతుందని, ఈ నిర్ణయంతో గ్రామంలో సత పలితాలు వస్తాయని మహిళలు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో జోరుగా పేకాట స్థావరంపై దాడి.. రూ. 6,870 నగదు స్వాధీనం



కోటగిరి/ మే 18/(జన సంఘర్షణ)
కోటగిరి మండల కేంద్రంలో పేకాడుతున్న ఆర్గురిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన దాడిలో రూ. 6,870 నగదు , పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు, ఎస్ఐ సునీల్ తెలిపారు. సమాచారం మేరకు దాడి నిర్వహించగా నిందితులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారని, పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు, చేసి దర్యాప్తు చేసుకున్నట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు.

## వ్యవసాయ శాఖ ద్వారా 50% సబ్సిడీపై జీలుగా విత్తనాలను

పోత్తంగల్ మండల/మే18/(జన సంఘర్షణ)



రైతులకు ముఖ్య గమనిక:
వ్యవసాయ శాఖ ద్వారా 50% సబ్సిడీపై జీలుగా విత్తనాలను రేపు అనగా 19.05.2025 నాడు ఉదయము 11.30 గంటలకు ఎల్ఎస్‌సీఎస్ పొతంగల్ రైస్ మిల్ వద్ద పంపినీ చేయడం జరుగుతుంధి. జీలుగ విత్తనాలు 30 కిలోల బస్తా 4905.00 రూపాయాలు. ఇందులో 50% సబ్సిడీ పోను 2452.50 రూపాయాలు రైతులు చెల్లించాల్సి వస్తుంది. ఎల్ఎస్‌సీఎస్ పొతంగల్ నందు 167 బస్తాలు అంధుబాటులో వున్నవి. రైతు సోదరులు పట్టా పాస్‌బుక్ మరియూ ఆధార్ కార్డ్ తీసుకువచ్చి విత్తనాలు తీసుకోగలరు. 2.5 ఎకారానికి ఒక బస్తా(30), 5 ఎకరాలకు అధికముగా 2 బస్తాలు మాత్రమే ఇవ్వబడతాయి. మండల వ్యవసాయ అధికారి పొతంగల్ పేర్కొన్నారు.

# నార్కోటిక్ స్నిఫర్ డాగ్తో బస్టాండ్,పార్సిల్ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు





**పెద్దపల్లి,మే 18 :-**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని పెద్దపల్లి పోలీస్ స్టేషన్ ప్రాంతంలో బస్టాండ్ ఏరియా,కార్గో పార్సిల్ ఏరియా,దుకాణాలు,పాన్ షాపులతో పాటు పలు బస్సుల్లో కూడా పెద్దపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, నార్కోటిక్ వింగ్ ఇన్స్పెక్టర్ ఎం.రాజ్కుమార్ సమన్వయంతో సోమవారం నార్కోటిక్ స్నిఫర్ డాగ్ సహాయంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు.అనంతరం పెద్దపల్లి ఐటీఐ కళాశాల పరిసరాలు,కళాశాల వెనుక ఉన్న ఖాళీ ప్రదేశాల్లో కూడా స్నిఫర్ డాగ్తో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి సరఫరా,వినియోగాన్ని నియంత్రించడమే లక్ష్యంగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడంతో పాటు నార్కోటిక్ స్నిఫర్ డాగ్లతో ప్రత్యేక తనిఖీలు కూడా చేపడుతున్నామని తెలిపారు.ఎవరైనా గంజాయి,మత్తు పదార్థాలు,అలాగే చిన్నపిల్లలకు మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లు,గుట్కా, సిగరెట్లు వంటి నిషేధిత వస్తువులు విక్రయించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.బస్టాండ్లో ఉన్న ప్రయాణికుల బ్యాగులను, అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేసి వారి వివరాలను సేకరించడం జరిగింది.గంజాయి మరియు మత్తు పదార్థాలను బస్సులు,రైల్వే మార్గాలు,ప్రైవేట్ వాహనాలు,కార్ల ద్వారా తరలిస్తున్నారని తెలిపారు.బస్సులు,రైళ్లలో ప్రయా ణించే సమయంలో ఎవరైనా అనుమానాస్పదంగా బ్యాగులతో తిరుగుతున్న వ్యక్తులు కనిపించినా లేదా మత్తు పదార్థాల సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసినా స్థానిక పోలీసులకు లేదా తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదా డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని కోరారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నార్కోటిక్ టీమ్ ఇన్స్పెక్టర్ రాజ్కుమార్,పెద్దపల్లి టౌన్ ఎస్ఐలు,పోలీస్ సిబ్బంది, నార్కోటిక్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిడికే 1&3 ఇంక్లైన్ లో మల్టి డిపార్ట్ మెంటల్ సమావేశం



**రామగుండం,మే 18 :-**

సోమవారం ఆర్జీ.1 జియం లలిత్ కుమార్ అదేశానుసారం జిడీకే 1&3 ఇంక్లైన్ లో “మల్టి డిపార్ట్ మెంటల్” సమావేశంలో 1 గ్రుఫ్ ఏజంట్ యల్.రమేష్ అధ్యక్షతన మన సంస్థ,మన గని,మన బాధ్యతలను వివరించే మల్టీ డిపార్ట్మెంట్ సమావేశం మొదటి బదిలీ మరియు రెండవ బదిలీలలో నిర్వహించడం జరిగినది.ఈ సందర్భంగా ఎజియం (ఐఈడి) ఆంజనేయులు మరియు వక్తలు మాట్లాడుతూ మన సంస్థ,మన గని,మన బాధ్యతలను వివరించే ఇట్టి “మల్టి డిపార్ట్ మెంటల్ సమావేశంలో వివిధ అంశాల గురించి కమిటి సభ్యులు తెలియజేస్తూ సంస్థ పురోభివృద్ధికి సాధించవలసిన అంశాల గురించి తెలియజేస్తూ ఉత్పత్తి ఉత్పాదకతా పెంచుకోవడం కొరకు గనిలో పని చేస్తున్న వివిధ విభాగాల వారిగా వారు ఒక సమిష్టిగా ఏర్పడి సమాలోచనలు జరిపి వాటిని అమలు చేయుటకు సలహాలు సూచనలు పరిగణలోకి తీసుకోవాలని ఈ సమిష్టి నిర్ణయాల వలన ఉత్పత్తి, ఉత్పదకతలు పెంచుటకు అవకాశం లభిస్తుందని తెలిపారు.మల్టి డిపార్ట్మెంట్ కమిటీ సభ్యులు వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి లోని గనులు వాటి పని తీరు గురించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత,బొగ్గు రవాణా, నెలల వారిగా నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి,రవాణా సాదించుటకు ప్రణాళికల గురించి వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్జి 1 ఏరియాకు నిర్తేశించిన ఉత్పత్తి పెంపునకు తీసుకోవలసిన ప్రణాళికల గురించి వివరించారు.అనంతరం ఉద్యోగులచే రక్షణ ప్రతిజ్ఞ చేయించడము జరిగినది.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, బ్రాంచి సెక్రటరీ రంగు శ్రీను,ఎజియం (ఐఈడి) ఆంజనేయులు,ఏరియా ఇంజనీరు రామమోహనరావు, ఏజంట్ యల్ రమేష్, యస్.ఓ.యం క్వాలిటి బ్రహ్మాజీ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, గని మేనేజర్ సుదీర్ జక్కుల్ వార్ యస్.ఇ సి.హెచ్ రాజన్న, ఫిట్ సెక్రటరి మానాల శ్రీనివాస్, సంక్షేమాదికారి నిహాల్ సాయి, కమిటి సభ్యులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక, చారిత్రక, పరిశోధన కేంద్రంగా మూడ్ మల్ నిలువు రాళ్ళు

**-నిలువురాళ్ల ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిది**

**- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక**



**మక్తల్, మే 18**

ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వకారణమని నారాయణపేట జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమల్ నిలువు రాళ్ల (మెన్హిర్స్) ను ఆమె సందర్శించారు. నిలువు రాళ్లు, సప్తర్షి మండలంతో ఖగోళ పరిజ్ఞానాన్ని, కాలాలను, వాతావరణ మార్పులను ఆనాడే తెలుసుకునేవారని, కాలాలను గుర్తించడానికి ఆది మానవులు నిలువురాళ్లను ఓ క్రమంలో ఏర్పాటు చేసినట్లు ఆర్కియాలజీ శాఖకు చెందిన అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఎలాంటి సాంకేతికత లేని 4 వేల సంవత్సరాల క్రితమే రాళ్ల ద్వారా తెలుసుకోవడం అనేది అబ్బురపరిచేలా, అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు యువజన క్రీడా/పర్యాటక వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ఆమె సూచించారు. రాష్ట్ర పర్యాటక శాఖ కు సంబంధించిన వారోత్సవాల టూరిస్ట్ గైడ్ పోస్టర్ తో పాటు మూడ్ మల్ నిలువు రాళ్ళ విశిష్టత ను తెలిపే ప్రచార పత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీ ఆర్ వో రషీద్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేశ్ శెట్టి, మూడ్ మల్ సర్పంచి, పురావస్తు శాఖ అధికారులు గ్రామస్తులు తదితరులు

# అమాయకుడు

రాకుమార



**రామగుండం,మే 18 :-**

తనదుమంచితనమున్ తనవారలెపుడును
చేదుగతలపోయ ఖేదమొందు
లోకపుసరదాలసోకులన్ బడబోక
నచ్చినరీతిని నడచుచుండు
కాలంబుజేసినగాయాలనెన్నియో
గుఱుతుజేసుకొనుచు కుములుచుండు
తెలిసియెవరినేని పలుచనజేయని
సత్త్వగుణపరమ సాత్త్వికుండు

దినమునొక్కతెఱగు దిగులుగాబ్రతుకుచు
పుటకపైనికినుక బూనువాడు
తలపునందుమెదలు పలుకులమ్మనుగాంచి
విధికినెదురుబడని వినయపరుడు.

గోదావరిఖని,పెద్దపల్లి జిల్లా
9550184758

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కొరకు వినతి పత్రం ఎన్. వినయ్




దివ్యాంగుల హక్కుల పోరాట సమితి
45-460, దుర్గానగర్, మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం
డా॥ బి.ఆర్. అంబేద్కర్
MRPS VHPS

గౌరవ అధ్యక్షులు
ఎస్. శాంతబాయి
అధ్యక్షులు
ఎన్. వినయ్
సెల్ : 9059646883
ఉపాధ్యక్షులు
పి. శ్రీనివాస్
పి. బాలమణి
ఎల్. సోను
కార్యదర్శి
ఆర్. మల్లేష్

అల్వాల్
తేదీ 18/05/206

శ్రీయుత గౌరవనీయులైన
రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్
నమస్కరించి చేసుకొని విజ్ఞప్తి

విషయము:- ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కొరకై తమరికి చేస్తున్న విజ్ఞప్తి.

అయ్యా,
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఇందిరమ్మ ఇండ్ల" పంపిణీలో మొదటి ప్రాధాన్యత దివ్యాంగులకు మరియు పేదలకు ఇస్తున్నారు. ఇందులో భాగంగా గత 40 సంగల నుండి మల్కాజిగిరిలోనేఅద్దె ఇండ్లలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఇందులో దివ్యాంగులు కేవలం ...

ప్రభుత్వం పై విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగలరని విజ్ఞప్తి.

OFFICE OF THE REVENUE DIVISIONAL OFFICER
18 MAY 2026
MALKAJGIRI DIVISION
MEDCHAL-MALKAJGIRI

దివ్యాంగుల హక్కుల పోరాట సమితి

**మల్కాజిగిరి మే 18** వికలాంగుల హక్కుల పోరాట సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఎన్. వినయ్ ఆధ్వర్యంలో వికలాంగులకు 5% జి ఓ ప్రకారం ఇండ్లు మంజూరు చేయాలనీ కోరు తూ ఆర్ డి ఓకి వినతి పత్రం ఇవ్వా లని ఆఫీసుకి రాగ ఆర్ డి ఓ అందు బాట్లో లేకపోవడంతోఆల్వాల్ ఎం. శ్రీనివాస్ శంకర్ డివిజనల్ అడ్మి నస్ట్రేటివ్ ఆఫీసర్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకి వారి ఛాంబర్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది.వికలాంగులు గత ప్రభుత్వంలో ఇండ్ల కోసం దరఖాస్తూ చేసుకున్నప్పటికి ఇండ్లు మంజూరు చేయలేదు. ప్రస్తుత ప్రభుతంలో కూడా దరఖాస్తూ చేసుకొని రెండు సం” లు గడుస్తున్నా ఇండ్లు మంజూరు చేయడం లేదు. వికలాంగులు వితంతువులు అందే ఇంట్లో ఉంటూ వచ్చే చాలి చాలని జీతాలతో బ్రతు కులు బ్రతకడం భారంగా మారింది. ఇందులో కొంత మంది కేవలం పెన్షన్స్ పైనే ఆధారపడి బ్రతికే వాళ్ళు ఉన్నారు. కావున ప్రభుత్వానికి మా సమస్యలు తెలియజేసి. ఇంతకు మందు కొంత మంది ఇండ్లు వచ్చిన మళ్ళీ భర్తల పేరు మీదా వచ్చిన భార్యల మీదా... భార్యల పేరు మీదా వచ్చిన వాళ్ళు భర్తల పేరు దరఖాస్తు చేసుకున్నారు. కావున మీరు సరైనా విచారణ జరిపి అర్హులను గుర్తించి వాళ్లకు ఇండ్లు మంజూరు చేయాలని కోరడం జరిగినది.

# ఐఎండబ్ల్యుఎఫ్ మహాసభలకు తరలిన ఏఐటియుసి నాయకులు



**రామగుండం,మే 18 -**

ఇండియన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటియుసి) మహాసభలు ఒరిస్సా లోని పూరి లో మే 20,21వ తేదీలలో జరుగుతున్న సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (గుర్తింపు సంఘం ఏఐటియుసి) ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి కామ్రేడ్ రంగు శ్రీను, సహాయ కార్యదర్శి కామ్రేడ్ మాదన మహేష్,బ్రాంచి కోశాధికారి కామ్రేడ్ ఎస్ వెంకట్ రెడ్డి,నాయకులు రెడ్డి వెంకట స్వామి,ఎ.వి.ఎస్ ప్రకాశ్ లు సోమవారం రామగుండం రైల్వే స్టేషన్ నుంచి పూరి

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
మంగళవారం
19 మే 2026

# భవిష్యత్తులో సంభవించే ఎలాంటి విపత్తులనైన సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం

**-జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.**

**-వరద ముప్పు ముంచెత్తితే.. క్షణాల్లో రక్షించే చర్యలపై కృష్ణా మండలం వాసునగర్ లో జిల్లా యంత్రాంగం లైవ్ డెమో**

**మక్తల్, మే 18**

భవిష్యత్తులోసంభవించే ఎలాంటి విపత్తుల నైనా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉందని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తెలిపారు.జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (NDMA) ఆదేశాలు, రాష్ట్ర విపత్తు స్పందన దళం (SDRF) సూచనల మేరకు నారాయణపేట జిల్లా కృష్ణా మండలం నదీ పరివాహక ప్రాంతమైన వాసునగర్ లో సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మాక్డ్రిల్ నిర్వహించారు. భారీ వరదలు సంభవించిన సందర్భంలో ప్రజలను ఎలా రక్షించాలి, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా బృందాలు ఎలా పనిచేయాలనే అంశాలపై ఈ మాక్డ్రిల్ చేపట్టారు. మాక్డ్రిల్లో భాగంగా వరదల కారణంగా వాసు నగర్ లో ముంపునకు గురై చిక్కుకున్న ప్రజలను ఎస్డిఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక, పోలీస్ శాఖలు సురక్షితంగా రక్షించే చర్యలను ప్రదర్శించారు. స్పందనా బృందాలు సమన్వయంతో పనిచేస్తూ బోటు, లైఫ్ జాకెట్ల సాయంతో ప్రజలను రక్షించి, ప్రథమ చికిత్స అందజేసి అంబులెన్సులో సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఈ మాక్డ్రిల్



కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పరిశీలించి, సహాయక చర్యల నిర్వహణ తీరును దగ్గరుండి పర్యవేక్షించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సమయంలో ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ప్రజల్ని ఎలా కాపాడాలని అంశంపై మార్క్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు సంసిద్ధత కోసం ఈ మాక్ డ్రిల్ అనేది ఎంతో ముఖ్యమైన ప్రక్రియ అని తెలిపారు. వరదలు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడే ఏడు ప్రదేశాలను జిల్లాలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. 10 సెంటీమీటర్స్ పైన వర్షపాతం నమోదు అయితే కృష్ణానది కి 6 నుంచి 7 లక్షల క్యూసెక్కుల నీరు వస్తే వాసు నగర్ లో వరద నీటితో అత్యవసర పరిస్థితి ఏర్పడే నేపథ్యంలో ఇక్కడ మోక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, నీటిపారుదల శాఖ, ఇతర ముఖ్యమైన శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యలను సంసిద్ధతను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, డీఎఫ్ఓ సురేష్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ ఈ వెంకట రమణ, ఆర్టీవో మేఘా గాంధీ, పీ ఆర్ ఈ ఈ అశోక్, జిల్లా మత్స్య అధికారి రెహమాన్, పశుసంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి, డీపీ ఆర్ వో రషీద్, కృష్ణా తహసిల్దార్ శ్రీనివాస్, వాసు నగర్ సర్పంచ్ సాశీతమ్మ, ఇతర జిల్లా శాఖల అధికారులు,రెవెన్యూ సిబ్బంది, గ్రామ

# గోరక్ష చట్టాలు కఠినంగా అమలు చేయాలి

**- జిల్లా ఎస్పీ వినీత్ కి వినతిపత్రం అందించిన విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు**

**నారాయణపేట, మే 18**

బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గోరక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలంటూ డిమాండ్ చేస్తూ సోమవారం విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ నాయకులు జిల్లా ఎస్పీ వినీత్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ నాయకులు మాట్లాడుతూ సకల దేవతా స్వరూపం గోమాత. వేదకాలం నుండి గోవును ఆరాధ్య దేవతగా పూజిస్తున్నాము. దేశ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టితో మొదలుకుని పర్యావరణ పరిరక్షణ... వ్యవసాయంతో పాటు మానవాళి ఆరోగ్య రక్షణకు గోమాత ఆధారం. అలాంటి గోవులను ప్రస్తుతం విచ్చలవిడిగా వధించి మాంసాహారంగా ఉపయోగించుకుంటున్నారు.వేలాది టన్నుల గోమాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. గోవును కాపాడుకోవాలనే ఉద్యేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977 సంవ త్సరంలో The Telangana Prohibition of Cow Slaughter and Animal preservation Ac 1977 ను అమలులోకి తెచ్చింది అన్నారు. ప్రస్తుతం ఈ చట్టం తెలంగాణలో అమలులో ఉంది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, ఆర్టికల్ 48 నిబంధనలు కూడా గోరక్ష కోసం ఏర్పాటు చేసినవే. అయినప్పటికీ చట్టవిరుద్ధంగా రాష్ట్రంలో విచ్చలవిడిగా గోవధ జరుగుతోంది. బలిష్టంగా ఉన్న ఎద్దులనుకూడా వధిస్తున్నారు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు .ముఖ్యంగా బక్రీద్ సందర్భంగా ఈ గోవధ మరీ రెట్టింపు స్థాయిలో జరుగుతోంది. చట్టాన్ని అమలు చేయవలసిన ప్రభుత్వ యంత్రాంగం చేష్టలుడిగి చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. గో ప్రేమికులు, గోరక్ష సంస్థలు అనేక సార్లు విజ్ఞప్తి చేసినా పాలకులు పట్టించుకోవడం లేదు. కనుక ఇప్పటికైనా గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఎస్పీకి వినతి పత్రం సమర్పించారు.

**ప్రధాన డిమాండ్లు.....**

- రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గోవధ శాలలను తక్షణం మూసివేయాలి.



- ఆక్రమణలో ఉన్న గోచర భూములను విముక్తి చేయాలి.
- ప్రస్తుతం గుర్తింపు పొందిన గోశాలలకు నిధులు కేటాయించాలి.
- ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గోశాలలను ఏర్పాటు చేయాలి
- దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని దేవాలయాలలో గోవులను పెంచాలి.
- గో ఆధారిత వ్యవసాయం చేస్తున్న రైతులకు మరియు గోపోషకులకు తగిన ప్రోత్సాహకాలను అందించాలి.
- బక్రీద్ సందర్భంగా గోరక్షకులు ఆవులు పట్టుకొని పోలీసులకు తెలియజేసే విధంగా గోరక్షకులకు గుర్తింపుపత్రాలు Telangana రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి.
- భాగ్యనగర్ బోరబండలోని బబ్బిగూడ, నార్సింగి మొదలైన స్థలాల్లో నిర్వహిస్తున్న పశువుల సంతలను తక్షణమే ఎత్తివేయాలి.
- వెంటనే భాగ్యనగర్ తో పాటు రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల శివారులలో ప్రత్యేకంగా పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా తరలింపబడుతున్న గో సంతతిని రక్షించటమే గాకుండా రవాణా కొరకు ఉపయోగిస్తున్న ట్రక్కులను సీజ్ చేసి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- రక్షింపబడిన గో సంతతి పోషణ కొరకు ప్రభుత్వమే పశుశాలలను (Cattle Ponds) ఏర్పాటు చేయాలి.
- తెలంగాణ హైకోర్టు ఆర్డర్ WP No. 15948 జి.ఓ 2021 వెంటనే అమలు చేయాలి.
- చట్టం కళ్లు గప్పి సాగిస్తున్న గోసంతతి అక్రమ రవాణను అరికట్టాలి,



ఆటోలు, లారీలతోపాటు క్లోజుడు కంటైనర్లలో తరలిస్తున్న మాఫియా పై చర్యలు చేపట్టాలి.

- ఆరోగ్యకరమైన పశువులను వధించకూడదని చట్టం చెబుతున్నా ఆవులతో పాటు ఆరోగ్యకరంగా వున్న ఎద్దులు, లేగ దూడలను వధించడం అటువంటి వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.
- ప్రభుత్వ అనుమతులు లేని వందలాది కభేళాలను మూసివేయాలి.
- జన సమూహాల మధ్య పశుకళేబరాల నుండి నూనె, టీ పొడి లాంటివి తయారు చేసే కర్మాగారాలను మూసేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలి.
- గ్రామాలలో దేవాలయాలకు వదిలేసిన గో సంతతిని వేలం పాట ద్వారా అన్యమతస్తులకు అమ్మడం హిందువుల మనోభావాలకు భంగం కాబట్టి ఆ వేలం పాటను నిలిపివేయాలి.

పై డిమాండ్ల పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గో హత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని దేశీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి విభాగం, విశ్వ హిందూ పరిషత్ డిమాండ్ చేశారు.ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నవారు జిల్లా గో రక్షక్ మీస్కిన్ సందీప్ విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షులు మురళి బటడ్ నగర కార్యదర్శి ప్రవీణ్ కుమార్ సంపంగి కృష్ణ మనసాని గిరీష్ రాజశేఖర్ రవికుమార్ గౌడ్ బజరంగ్,జిల్లా కన్వీనర్ శ్రావణ్ జిల్లా బజరంగ్ దళ్ కో-కన్వీనర్ భీమేష్, నీరటి వెంకటేష్ ఆకాష్ అరవింద్ శ్రీనివాస్ చక్రి బాలరాజు భరత్ కుమార్ బజరంగ్ దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co